

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 13 | సంచిక : 11 | జూలై 2008

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 28
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ఖండవల్లి ............ 06-04-08
లక్కవరం ............ 11-03-08
విశాఖపట్నం ........ 10-04-08
భీమవరం ............ 13-04-08
పాలకోడేరు .......... 14-04-08

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 06-04-08, ఖండవల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సేవాభావంలో మనం ఎవరినైనా ఆదర్శంగా పెట్టుకోవాలి అంటే ఆంజనేయస్వామిని గుర్తుపెట్టుకోవాలి. మనం శ్రీరామచంద్రమూర్తిని అర్చనచేస్తే ఆంజనేయస్వామి నన్నే అర్చన చేస్తున్నారు అనుకొంటాడు. మనం ఆంజనేయస్వామిని అర్చనచేస్తే శ్రీరాముడు నన్నే అర్చన చేస్తున్నారు అనుకొంటాడు. అక్కడ శరీరాలు తేడా కాని హృదయం ఒక్కటే. తండ్రి ప్రహ్లాదుడిని ఎన్నోరకాలుగా పీడించాడు కాని ఇసుమంతయూ ఉద్రేక పడలేదు. భగవంతుడు ప్రహ్లాదుడికి దర్శనమిచ్చినప్పుడు ఆయనను ఎవరైతే పీడించారో వారికి కూడా మోక్షం రావాలి అని ప్రహ్లాదుడు కోరుకొన్నాడు అంటే స్వపర భేదం లేదు. అందుకే భక్తులలో ప్రహ్లాదుడికి అగ్రస్థానం ఇచ్చారు. మనం పాడైపోవటానికి ఉద్రేకాలు కారణం, ఉద్రేకాలవలన శక్తి వృధా అయిపోతుంది. మూఢనమ్మకాలు కూడా ఉద్రేకాలే. కుడికాలు ముందుపెట్టాలా, ఎడమకాలు ముందుపెట్టాలా లేకపోతే ఎవరు ఎదురువస్తున్నారు లేకపోతే ఈ రోజులు మంచివి, ఈ రోజులు చెడ్డవి అని ఇలా విభజించుకొని అవసరంలేని గొడవలు పెంచుకొంటూ జ్ఞాన మార్గానికి దూరమైపోతున్నాము. అందువలన సాధనలో బహుజాగ్రత్తగా ఉండాలి. కంగారుపడి సాధనలు చెయ్యవద్దు. మీరు నెమ్మదిగా నడిచినా మార్గం తప్పకుండా ఉంటే మీ అందరికీ మోక్షం వస్తుంది.

లోకానికి సంబంధించిన ఆకర్షణలలోపడి మార్గం తప్పిపోతున్నారు. ఈ చావులు, పుట్టుకలు, బంధువులు, విరోధులు, స్నేహితులు ఇది అంతా మనస్సు కల్పించిన గొడవలు, ఇది అంతా తాత్కాలికం. కాని గురువుతో ఉన్న సంబంధం శాశ్వత సంబంధం,

మనకు జ్ఞానం వచ్చేవరకు గురువు మనలను విడిచిపెట్టడు. మనకు బాగా ఇష్టమైన వ్యక్తి కలకాలానికి కనిపిస్తే ఎలా కౌగిలించుకొంటామో మనం గురువు అనుగ్రహం పొందితే మరణాన్ని కూడా అలా కౌగిలించుకొంటాము. ఒక గంటలో మనకు మరణం వస్తోంది అనుకోండి, మనకు భయం వేయదు, గురువు అనుగ్రహాన్ని పొందాము కాబట్టి స్నేహితుడిని కౌగిలించుకొన్నట్లు మరణాన్ని కూడా కౌగిలించుకొంటాము. గురువు మీద మనకు ఉన్న ఇష్టం మటుకు మనస్సు కల్పితంకాదు. రమణభగవాన్‌తో మనకు ఏదైనా అనుబంధం వచ్చింది అనుకోండి. మొదటలో ఆయనను ఏదో ప్రేమిస్తున్నాము, ఆయన చెప్పిన మార్గంలో ప్రయాణిస్తున్నాము అనిపిస్తుంది. కొంతకాలం తరువాత ఇది విడదీయరాని అనుబంధం, జన్మాంతర అనుబంధం అనేటువంటి అనుభవం మనకు కలుగుతుంది. అయితే భక్తులలో చాలామంది మార్గం విడిచిపెట్టేస్తున్నారు. మార్గం విడిచిపెట్టేస్తే మీకు ఎవరూ సహాయం చేయలేరు. మీరు తొందరపడవద్దు, నెమ్మదిగా ప్రయాణం చెయ్యండి, అనుకరణ వద్దు, మీ మార్గంలో మీరు ప్రయాణం చెయ్యండి, అందరికీ జ్ఞానం కలుగుతుంది.

మనం డ్యూటీ చెయ్యాలి, మమకారం పెట్టుకోకూడదు. పనివలన దుఃఖంరాదు, మమకారం వలన దుఃఖం వస్తుంది. గురువుతో ఉన్న సంబంధం ఒక్కటి మాత్రమే శాశ్వతమైనది. మనం గురువును ఎన్నుకోవటంలో విశేషం లేదు. గురువు మనలను ఎన్నుకోవటంలో వైభవం అంతా అక్కడ ఉంది. గురువు మనలను ఎన్నుకొంటే అది పులినోటిలోపడ్డ మాంసపుముక్క. వాడు ఎన్ని జన్మలలో ఎక్కడ ఏ లోకంలో ఉన్నా వాడు రక్షింపబడేతీరుతాడు, అది గురువు అనుగ్రహం. లోకం నిజం కాదు, అంతా మాయే. జీవుడిని భగవంతుడి దగ్గరకు రానియ్యకుండా ఈ లోకంలో చాలామాయ పెట్టాడు, చాలా ఆకర్షణలు పెట్టాడు. అందులో ధనం, సెక్స్ ఇవి చాలా బలీయమైన ఆకర్షణలు. ఈ లోకంలో ఉన్న ఆకర్షణలలోనుండి బయటకురాలేకపోతున్నాము. ఈ ఆకర్షణల వలన, మనకు ఉన్న అలవాట్లవలన దేవుడు లేడు, మరణానంతర జీవితం లేదు అనుకొంటున్నాము అంటే ఉన్నది లేనిదానిలాగ, లేనిది ఉన్నదానిలాగ మనకు అనిపిస్తోంది, ఇదే మాయ. ఈ మాయలోనుండి బయటపడి జీవుడు తరించటం చాలా కష్టం. మనకు ఉన్న అలవాట్లను తొలగించుకోకపోతే అవి వచ్చే జన్మకి వచ్చేస్తాయి. అందుచేత కష్టపడి సాధన చేసి, బహుజాగ్రత్తగా జీవిస్తూ మన శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని పాడుచేసే అలవాట్లలో నుండి బయటకు రావాలి.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః**

**అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ**

రమణ భక్తులందరికీ ఈ శ్లోకం మంత్రం. కృష్ణుడు చెప్పిన ఈ శ్లోకం మీదే గురిపెట్టండి అని భగవాన్ అన్నారు. భగవంతుడు అంతర్యామిగా లేకుండా అసలు దేహము రాదు, అది పాము దేహం అవ్వవచ్చు, మానవదేహం అవ్వవచ్చు, దేవతలకు సంబంధించిన దేహాలు అవ్వవచ్చు. సమస్త జీవకోటి యొక్క హృదయాలలో చైతన్యముగా ఉన్నాను, జీవకోటికి ఆది నేను, మధ్య నేను, అంతము నేను, మీరు మాట్లాడే మాటలకు, మీరు చేస్తున్న పనులకు నేను సాక్షిగా ఉన్నాను. మీరందరు నాలోనుండే వచ్చారు, నాలోనే ఉన్నారు, ఈ జీవుడు అంతమైనప్పుడు మరల నాలోనే ఐక్యమైపోతారు. సృష్టి, స్థితి, లయములున్న నేనే అయి ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. ఇది వూరికే మనం నోటితో చెప్పకొంటున్నాము, ఇది మనకు అనుభవంలోనికి రావాలి, అప్పడు మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీరు చెడుప్రారబ్ధం అనుభవిస్తున్నారు అనుకోండి లేకపోతే మంచిప్రారబ్ధం అనుభవిస్తున్నారు అనుకోండి. ఇదంతా దేహానికి, మనస్సుకు సంబంధించిన విషయాలే, ఇదంతా స్వప్నమే. కృష్ణుడు చెప్పిన చైతన్యం తప్పించి ఏదైనా మనస్సు యొక్క కల్పితమే.

మీకు పరిస్థితులు బాగా ఉన్నాయి అనుకోండి, పొంగిపోతున్నారు అనుకోండి లేకపోతే పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నాయి అనుకోండి, మీరు కుంగిపోతున్నారు అనుకోండి, మీకు వైరాగ్యం లేకపోవటం వలన ఇదంతా వస్తోంది. ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధిలోనికి రావాలంటే పునాదిగా ఎంతో కొంత వైరాగ్యం ఉండాలి. వైరాగ్యం లేకుండా జ్ఞానం రాదు. మీకు ఉన్న భక్తి నిజమైతే లోక ఆకర్షణలు వచ్చి మీ మీద పడకుండా ఆ భక్తి మీకు కవచంలాగ కాపాడుతుంది అని రామకృష్ణుడు చెప్పారు. అంటే లోకానికి సంబంధించిన గాయాలు మీకు తగలకుండా మీ భక్తే మిమ్మల్ని కాపాడుతుంది, అలా ప్రహ్లాదుడిని కాపాడింది. అందుచేత మనకు శరణాగతి భావన చాలా ముఖ్యం. పరమపవిత్రుడు కాని భగవంతుడి సన్నిధానం లోనికి చేరుకోలేడు. మనస్సును పవిత్రం చేసుకోవటానికి, ఏకాగ్రం చేసుకోవటానికే ఈ సాధనలు, ఈ యాగాలు, అభ్యాసాలు, సత్పురుషుల సహవాసాలు ఇవి అన్నీ దానికోసమే. నువ్వు సాధన చేసేటప్పడు ఏదైనా మహిమలు రావచ్చు, కొంచెం శాంతిగా ఉన్నట్లు అనిపించవచ్చు కాని అక్కడితోటి ఆగిపోవద్దు. మనస్సు అణిగినప్పడు కొంత ఆనందం రావచ్చు, అక్కడ ఆగిపోవద్దు, ఇంకా లోపలకు వెళ్ళాలి. ఈశ్వరుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు కదా వాడి దగ్గరకు చేరుకొనేవరకు మీ ప్రయాణం ఆపుచేయవద్దు, అదే గమ్యంగా పెట్టుకోండి. వినండి, చూడండి, మననం చెయ్యండి అంటే చెవులతో వినటం కాదు, లోపల మనస్సుతో వినాలి. ఏ వస్తువు బాగుపడాలో ఆ వస్తువుతో వినాలి, ఆ వస్తువుతోటే

గురువును చూడాలి, ఆ వస్తువుతోటే మననం చెయ్యాలి, అప్పడు మీరు తరిస్తారు. గురువు చెప్పే ప్రతీమాట అది మాటకాదు, అది అనుగ్రహం. లోకానికి సంబంధించిన ప్రయోజనం కోరి చెపితే అది మాట, కేవలం మిమ్మల్ని జ్ఞానగంగలో స్నానం చేయించటానికి చెపుతున్నాడు, అది మాటకాదు, అది అనుగ్రహం. ఎంతటివాడినైనా మనస్సు మాయ చేసేస్తుంది. మీకు ఏదైనా పదవి వచ్చింది అనుకోండి, లేకపోతే కోటి రూపాయలు పది కోట్లు అయ్యింది అనుకోండి అది రోడ్డుమీద ఉన్న దుమ్ముతో సమానం అని తెలుసుకోకుండా, నాలో ఏదో విశేషం ఉంది అనుకొంటారు, బోర్లా పడతారు. ఏదో దుమ్ము, తుక్కు వచ్చింది అందులో విశేషం ఏముంది. ఇది అంతా మనస్సు యొక్క కల్పితం. ఏదో విశేషం ఉంది అని ఎవరు చెపుతున్నారు, అహంకారం చెపుతోంది, అది మహామాయ. బయట నుండి ఏదో వచ్చింది, నాలో ఏదో విశేషం ఉంది అని ప్రతీవాడు అనుకొంటున్నాడు, వీడి కొంప ముంచటానికే అది వచ్చింది అని వాడికి తెలియటం లేదు.

కర్మ అనుభవించటానికే దేహం వచ్చింది. ఆ దేహప్రారబ్దాన్ని బట్టి లాభం వస్తూ ఉంటుంది, నష్టం వస్తూ ఉంటుంది. మనస్సు ఎంత నిజమో, లోకం ఎంత నిజమో ఈ అదృష్టం, దురదృష్టం కూడా అంతే నిజం. కాని ఈ అదృష్టాలు, దురదృష్టాలు వచ్చినప్పడు మిమ్మల్ని తేలు కుట్టినట్లు కుడుతూ ఉంటాయి, మీ మనస్సును కుదురుగా ఉండనివ్వవు. అదృష్టం వస్తే ఏనుగు మీద కూర్చొన్నట్లుగా ఉంటుంది, దురదృష్టం వస్తే కింద పాతాళలోకంలోనికి పడిపోయినట్లుగా ఉంటుంది. ఇదంతా మాయ అని తెలియక ఈ గొడవలో కలిసిపోతున్నారు, ఇదంతా మిమ్మల్ని దారి తప్పించటానికి ఈ ప్రకృతి చేసే చమత్కారం. లాభాలు, నష్టాలు ఇవి అన్నీ బయట గొడవలు. బయట గొడవలకంటే లోపల గొడవలు చాలా ప్రమాదం. ఎందుచేతనంటే ఈ లోపల గొడవలు అనేక జన్మలనుండి వాసనలకింద వస్తున్నాయి. రోడ్డు మీద తిరిగే పాము వలన మనకు అంత ప్రమాదం లేదు, కొంచెం తప్పించుకొని తిరగవచ్చు. మన ఇంట్లోనే పాము తిరుగుతూ ఉంటే ఎప్పడు కాటేస్తుందో చెప్పలేము. లోపల గొడవలు ఇంట్లో ఉన్న పాముల వంటివి, అవి ఎప్పడు కాటేస్తాయో చెప్పలేము. అందుచేత అందరూ ఏమి చెయ్యాలి అంటే ప్రశాంతంగా ఇంటిదగ్గర కూర్చొని మనలోని బలహీనతలు ఏమిటి అని జాగ్రత్తగా చూసుకొని, వాటిని తొలగించుకోవటానికి సాధన చెయ్యాలి. లోకవాసన మిమ్మల్ని లోపలకు వెళ్ళనివ్వదు, పండితులు దేవుడికోసం హృదయంలో వెతకరు, పుస్తకాలలో వెదుకుతారు, వాక్యాలకు అర్ధాలు చెప్పి నేను పండితుడిని అంటాడు. ధనవంతుడిని ధనంలోపలకు వెళ్ళనివ్వదు.

దేహప్రారబ్ధాన్నిబట్టి ఆ ధనం వచ్చింది అనుకోడు, నా తెలివితేటలను బట్టి వచ్చింది అనుకొంటాడు, ఇంకా గర్వం పెరిగిపోతుంది. నేను అట్టివాడిని, ఇట్టివాడిని అని ఇలా మీరు అనుకొన్నంతకాలం మీరు కోటి ప్రయత్నాలు చేసినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. లోపల అలవాట్లు ఏమిటో చూసుకోండి, ఎవరినీ అనుకరించవద్దు. మన దేహంతో ఉన్న రోగాలు తగ్గించుకోవటానికి ఎలా ప్రయత్నం చేస్తామో అలాగే మన మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి సాధన చెయ్యాలి వాసనలు వేరుతో సహానశిస్తేగాని ఆత్మజ్ఞానం కలుగదు. లోపల వాసనల వేగం ఎక్కువగా ఉన్నప్పుడు గురువు ఎప్పుడైనా ఆత్మజ్ఞానం తాలూక రుచి మీకు చూపించినా ఆ రుచి చూస్తారుగాని అది స్థిరపడదు, మరల జారిపోతూ ఉంటారు. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధపనికిరాదు. ఏ గంటకాగంట సద్వినియోగం చేసుకోవాలి. మన జీవితానికి ఇదే చివరిరోజు ఇంక రేపు మనం చూడము అనుకొని సాధన చేస్తే వాడికి పట్టుదలపెరుగుతుంది, వాడు తరిస్తాడు. మనం అజ్ఞానమనే దీర్ఘనిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానం అనే నిద్ర నుండి మనలను లేపేవాడు ఒక్క గురువు తప్పించి ఎవడూ లేడు. ఆత్మజ్ఞానం ఉన్నవాడు మాత్రమే ఈ నిద్రలో నుండి మీకు మెలుకువ తీసుకొని రావాలిగాని మరొకడి వలన సాధ్యం కాదు. మనం ఎంత సహజంగా గాలి పీల్చుకొంటామో అంత సహజంగా, అంత నార్మల్‌గా గురువు మనకు సహాయం అందిస్తాడు గాని నేను ఏదో ఉద్ధరిస్తున్నాను అనుకొనేవాడు గురువు కాదు. జ్ఞాని ఏ పని చేసినా సహజంగా చేస్తాడు అందులో ఏదో విశేషం ఉందని ఆయన అనుకోడు.

నేను అనే తలంపు ఉంటే నీకు వేరుబుద్ధి వస్తుంది, వేరుబుద్ధిలో నుండి భయం వస్తుంది. భయం అనేది ఒక తలంపు, ద్వేషం ఒక తలంపు, అసూయ ఒక తలంపు, స్నేహాలు, విరోధాలు కూడా తలంపులే. మన హృదయంలో ఉన్న బ్రహ్మం తప్పించి జీవితంలో అన్నీ తలంపులే. ఈ తలంపులన్నింటికి మూలం నేను అనే తలంపు. ఈ నేను అనే తలంపు నీకు లోపలనుండే వస్తోంది. అది ఎక్కడ ఉదయించి వస్తోందో అక్కడకు దానిని తీసుకొనివెళ్ళటమే సాధన యొక్క గమ్యం. వారిని ఉద్ధరించాలి అనుకొంటున్నాను, వీరిని ఉద్ధరించాలి అనుకొంటున్నాను అని భగవాన్‌తో ఎవరైనా అంటే ముందు నువ్వు ఎవడివో నువ్వు తెలుసుకో. అది తెలుసుకొన్నాక వారు మిగిలితే అప్పుడు వారిని ఉద్ధరించవచ్చు అనేవారు భగవాన్. రమణమహర్షిగారు వూరికే అరుణాచలం అన్నారు, ఆ క్షేత్రానికి ఆకర్షింపబడ్డారు, ఆయన పని పూర్తి అయిపోయింది, అంటే జన్మాంతరంలో సాధన చేసి ప్రిపేర్ అయ్యి వచ్చారు. అరుణాచలం అన్నారు ప్రకృతిలోనుండి, మాయలోనుండి బయటకు వచ్చేసారు. మానవజాతి అంతా ఏ సుఖాన్ని పొందటానికి ప్రయత్నం

చేస్తోందో ఆ సుఖస్థానాన్ని వూరికే అరుణాచల అని స్మరించటం వలన ఆయన పొందారు, అంటే అరుణాచల అని స్మరించటం వలన హృదయగుహలో పడిపోయారు, అది జన్మాంతర అనుబంధం. కొంతమంది రాజకీయ నాయకులు వారి చుట్టూ తిరిగేవారికి, బంధువులకు సహాయం చేసి లోకానికి సేవ చేస్తున్నాము అంటారు. అది మాయ. అది దయ కాదు. స్నేహితులతోటి, బంధువులతోటి, పార్టీలతో సంబంధం లేకుండా ఎక్కడైతే అవసరం ఉందో అక్కడ ఉపయోగపడుతూ ఉంటే అది దయ. వాడు మనకు ఓటు వేయకపోయినా, మనకు బంధువు కాకపోయినా వాడు కష్టకాలంలో ఉంటే అక్కడకు వెళ్ళి వాడిని ఆదుకొంటే అది దయ. మాయలో ఉన్నవాడికి దేవుడి అనుగ్రహం రాదు, దయగలవాడికి దేవుని అనుగ్రహం వస్తుంది. అరుణాచలేశ్వరుడితో భగవాన్ ఏమన్నారు అంటే లోకానికి సంబంధించిన ఆకర్షణలో నుండి బయటకు రావటానికి నాకు ఉపకారం చేసినమాట నిజమే, నీమీద నాకు ఉన్న ఇష్టం, నీవు వేరు నేను వేరు అనే భేదభావన ఇంకాపోవటం లేదు. భేదభావన పోతేగాని అద్వైతభావన కలుగదు. నీ అనుగ్రహాన్ని చూపించి నాలో ఉన్న భేదబుద్ధి తొలగించు. అప్పుడు అద్వైతానుభవం కలుగుతుంది, అదే పరమస్థితి. అక్కడకి చేరేవరకు మన ప్రయాణం ఆగదు అన్నారు.

భగవాన్ యొక్క వైభవం ఏమిటి అంటే గొప్పగొప్ప పదవులు ఉన్నవారు, లోకానికి సంబంధించిన వైభవం ఉన్నవారు, కోట్లు డబ్బు ఉన్నవారు, పండితులు, అందమైన స్త్రీలు ఎవరు వచ్చినా ఆయన మనస్సును ఆకర్షించలేదు. ఎందుచేతనంటే ఇది అంతా స్వప్నమే అని ఆయనకు తెలుసు. అంతేకాదు ఇవన్నీ ఉపద్రవాలు, ఉద్రేకాలు అని కూడా ఆయనకు తెలుసు. ప్రపంచంలో ఉన్న ఏదైనా ఆకర్షణకు గురి అయితే అది ఎప్పటికైనా ఉపద్రవం తీసుకొనివస్తుంది అని ఆయనకు తెలుసు. ఆయన దేనికి ఆకర్షింపబడలేదు, ఎక్కడా బంధం పెట్టుకోలేదు. ఫళనిస్వామి భగవాన్‌కు మొదటి సేవకుడు, సుమారు 20 సంవత్సరాలు భగవాన్‌కు సేవ చేసాడు. మట్టిపిడతతో భిక్ష చేసుకొనేవాడు, మట్టిపిడతలో అన్నం తినేవాడు, మట్టిపిడతతో నీరు తాగేవాడు, ఎవరైనా ఏదైనా ఇచ్చినా తీసుకొనేవాడు కాదు, గొప్ప వైరాగ్యమూర్తి. ఆయన చివరి క్షణాలలో భగవాన్ విరూపాక్షగుహకు వచ్చి ఫళనిస్వామి శిరస్సును ఆయన ఒడిలో పెట్టుకొని అశీర్వదించి మోక్షాన్ని ప్రసాదించారు, తరువాత అళగమ్మకు, గోలక్ష్మికి కూడా మోక్షాన్ని ప్రసాదించారు. మనకు వారికి తేడా ఏమిటి అంటే మనకు అన్నీ కావాలి, అన్నింటితోపాటు భగవాన్ కావాలి. కాని వారికి భగవాన్ తప్పించి ఏమీ అక్కరలేదు, అదీ తేడా. భగవాన్‌తో ఒక ప్లీడరుగారు ఏమన్నారు అంటే నాకు దేహం తెలుస్తోంది, మనస్సు తెలుస్తోంది కాని మీరు హృదయంలో దేవుడు ఉన్నాడు, లోపలకు

చూసుకో అని చెపుతున్నారు, నాకు మనస్సు గొడవలు తెలుస్తున్నాయిగాని మీరు చెప్పే దేవుడు గురించి తెలియటంలేదు అంటే భగవాన్ ఎంతసరళంగా చెప్పారు అంటే నీకు తెలిసిన దేహాన్ని, మనస్సును ఈ రెండింటిని నీ హృదయంలో ఉన్న ఆ తెలియని వస్తువును పట్టుకోవటానికి ఉపయోగించుకో. అంతకంటే నీవు చేసేపని ఏమీ లేదు అని చెప్పారు. నీకు ఉన్న సర్వశక్తులు, సర్వయుక్తులు, మానసికబలం, ప్రతీ శ్వాసకూడా నీలోపల ఉన్న పరమాత్మను తెలుసుకోవటానికి ఉపయోగిస్తూ ఉంటే ఆయన దయ నీ మీద వర్షిస్తుంది, ఆయన నీకు తెలియబడతాడు. మనకు ఎంత పాండిత్యం ఉన్నా గురువు అనుగ్రహం లేకుండా హృదయస్థానానికి వెళ్లే మార్గం కనబడదు, లోపలకు వెళ్లటం మాట అటుంచండి, అసలు ఆ మార్గమే మీకు కనబడదు, ఎవ్విరితింగ్ ఈజ్ గురు. మనం ఏదైనా అతిగా తింటాము అనుకోండి కడుపు నొప్పి వస్తుంది. తినేటప్పడు సంతోషంగా తింటాము, బాధ అనుభవించేటప్పడు ఏడుస్తూ అనుభవిస్తాము. తినేటప్పడు సంతోషంగా ఉన్నప్పడు బాధ అనుభవించేటప్పడు ఎందుకు సంతోషంగా ఉండలేకపోతున్నావు. అప్పు చేసేటప్పడు సంతోషంగా చేస్తాడు, ఇవ్వగలిగి ఉండికూడా తీర్చేటప్పడు కష్టంగా తీరుస్తాడు. ఇదే మాయ.

ఈశ్వరుడు వివేకవంతుడని, మనకు ఏది మంచిదో మనకంటే ఆయనకే బాగా తెలుసు అని, ఈ కోరికలు నెరవేరితే మనం పాడయిపోతాం కాబట్టి ఆ కోరికలు నెరవేరకుండా ఆపుచేస్తున్నాడని మన పాడుబుద్ధికి అర్థం కావటంలేదు. నీ బుద్ధి పాడైపోయిన తరువాత నీకు ఎన్ని ఉంటే మాత్రం ఏ ప్రయోజనం. పిచ్చోడికి భోగాలు ఉంటాయి అనుకోండి, ఆ భోగాలు ఏమి చేసుకొంటాడు. గురువుకీ ఆయన దేహానికి ఏమీ సంబంధం లేదు. దేహం ఉన్నప్పడు కూడా గురువు యొక్క దేహం కాదు అనుగ్రహించేది. ఏదైతే అనుగ్రహిస్తోందో దానికి చావులేదు, చనిపోయేది అనుగ్రహించలేదు. గురువు ఎక్కడ ఉన్నా ఆయన యొక్క అనుగ్రహం అలా ప్రవహిస్తూనే ఉంటుంది. మనకు యోగ్యత లేక దానిని అందుకోలేక పోతున్నాము. భగవాన్ అనేవారు వస్తువు ఎదురుగా ఉన్నప్పటికీ వారికి అర్హత లేనప్పడు, యోగ్యత లేనప్పడు కొంతమంది కళ్ళు ఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు. ఎవడికో భగవాన్‌మీద కోపం వచ్చి మీ దయ నా మీద లేదు, మీ అనుగ్రహం నా మీద లేదు అన్నాడు. అప్పడు భగవాన్ సోఫాలో నిటారుగా కూర్చొని సముద్రానికి హద్దులు ఉన్నాయి కాని గురువు అనుగ్రహానికి హద్దులు లేవు అన్నారు, అట్టిది గురువు అనుగ్రహం. అరవిందఘోష్ గారి గదిలోకి రాత్రిళ్ళు ఎవరూ వెళ్లరు. ఒకసారి ఆయన రాత్రి లెగిసినప్పడు కింద ఉన్న తివాచీ తగిలి పడిపోయారు, కాలు విరిగిపోయింది, ఆయన ప్రశాంతంగా ఉన్నారు. తల్లి ఎక్కడో ఇంకో బిల్డింగ్‌లో ఉన్నారు. ఎప్పడైతే ఈయన

పడిపోయాడో అప్పుడు తల్లిమీద ఏదో పెద్ద భూతం వచ్చి పడినట్లు ఆవిడకు మెలుకువ వచ్చింది. ఆవిడ సేవకులను పిలిచి అరవింద పడిపోయాడు, ఆ గదిలోనికి వెళ్ళిచూడండి అని చెప్పింది. అరవింద ఆవిడకు చెప్పలేదు. కాని అది హార్ట్ టు హార్ట్ ఆప్యాయతలో నుండి వచ్చింది. అలాగే బుద్ధుడి కూడా ఆనంద్ ఉండేవాడు. బుద్ధుడికి మంచినీళ్ళు కావాలి అనుకోండి, నీళ్ళు కావాలని బుద్ధుడు అడగలేదు కాని బుద్ధుడికి నీరు కావాలని ఆనంద్‌కు తెలిసేది. బుద్ధుడికి ఆకలివేస్తే ఆయన అడగనక్కరలేదు, బుద్ధుడికి ఆకలిగా ఉందని ఆనంద్‌కు తెలిసేది. అట్టిది ఆప్యాయత. లోపల ఉన్న అనురాగానికి దేహాలతో సంబంధం లేదు, అది ప్యూర్ లవ్. మీరు గురువు అనుగ్రహం గురించి చెపుతారు, ప్రేమ గురించి ఎప్పడూ మాట్లాడరేమిటి అని భగవాన్‌ను అడిగారు. అనుగ్రహం ప్రేమ లేకుండా ఉంటుందా అన్నారు భగవాన్. మనం బయటకు అందరిలాగే సామాన్యంగానే కనిపిస్తూ ఉండాలి, పెద్ద పెద్ద స్వాములు లాగ కనబడనక్కరలేదు, లోపల వైరాగ్యం పెంచుకొంటూ రావాలి. మనం ఈ భూమి మీద తిరుగాడుతున్నప్పడే, గృహస్థ ధర్మంలో ఉన్నప్పడే లోపల పక్కానికి వచ్చేయాలి. చావు వచ్చేటప్పటికి లోకం గొడవలు ఏమీ గుర్తురాకుండా, మనస్సును ఈశ్వరుని పాదాల మీద నిలబెట్టి ఫ్రీగా ఉండటం మంచిది. మన జీవితానికి సంబంధించిన గొడవలు గుర్తురాకుండా, ప్రతీ శ్వాస ఈశ్వరుడికి అర్పించి డెత్‌డేకి రెడీగా ఉండాలి.

మీరు సాధన చేసేటప్పడు కూడా వేగిరపడకూడదు, ఓర్పుగా ఉండాలి. మిమ్మల్ని పరీక్ష చేయటానికి ఎప్పడైనా భగవంతుడు కనిపించి కోటి జన్మల తరువాతకూడా నీకు మోక్షం ఇవ్వను అని అంటే మీ ఇష్టం అనాలి కాని కోటి జన్మలవరకు నాకు మోక్షం ఇవ్వవా అని అడగకూడదు. భగవంతుడు మనలను చూస్తూ ఉంటాడు. మనం పచ్చిపచ్చిగా ఉంటే మనలను తీసేస్తాడు. అంటే పునర్జన్మలో పడేస్తాడు. వీడు బాగా ముగ్గాడు అని తెలిస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. మీకు ధనం ఉండవచ్చు, కార్లు ఉండవచ్చు, పదవులు ఉండవచ్చు. ఇవన్నీ అవుట్‌సైడ్ గొడవలు, వాటితో కలవకండి, వాటితో కలిస్తే దారి తప్పిపోతారు. నేను ధనవంతుడిని, నేను పండితుడిని, నేను మినిష్టర్‌ని అని ఇలా అనుకోవద్దు, అలా అనుకొంటే పతనం ప్రారంభమవుతుంది. ఇందులో ఏదీ మీరు కాదు. అవుట్‌సైడ్ గొడవలలోనికి వెళితే ఫెయిల్ అయిపోతారు. బయట గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మీ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోండి. మీకు అనుకూలమైన గొడవలు వచ్చినా, ప్రతికూలమైన గొడవలు వచ్చినా అన్నీ అబద్దాలే. మీ మనస్సు కూడా అబద్ధం. అందుచేత అబద్ధం అబద్ధంతోటి కలిసిపోవటానికి ఎప్పడూ సిద్ధంగా ఉంటుంది. అప్పడు నిగ్రహించు కోవాలి. మీకు మంచి

వచ్చినా, చెడ్డ వచ్చినా రెండూ స్వప్నమే, అది గుర్తుపెట్టుకోండి. ఈ ఆధ్యాత్మికవిద్యకు, ఆత్మవిద్యకు రమణమహర్షిగారు సైంటిస్ట్‌లాంటివారు. ఆయన ఎప్పడు గుడ్డినమ్మకాలమీద ఆధారపడి చెప్పలేదు. ఇప్పడు ఏదో చేసుకోండి. చనిపోయినతరువాత ఏదో వస్తుంది ఇటువంటిమాటలు ఎప్పడూ ఆయన చెప్పలేదు. రీజన్ విడిచిపెట్టి ఆయన ఏది చెప్పలేదు. మన జేబులో పది రూపాయల కాగితం ఉంది అనుకోండి, అది పోవాలని అనుకోము. ఎందుచేతనంటే అది మనది అనుకొంటున్నాము. అది ఎప్పడైనా మనకు తెలియకుండా పోయింది అనుకోండి, పోయింది పోయింది అంటాము. అలాగే మన అహంకారాన్ని మనం పోగొట్టుకోలేము. మన జేబులో ఉన్న పది రూపాయల కాగితం మనకు తెలియకుండా ఎలా జారిపోయిందో అలాగే గురువు అనుగ్రహం మనకు ఉంటే మన అహంకారం అలా జారిపోయేటట్లు చూస్తాడు కాని మన తెలివితేటలవలన మనం దానిని పోగొట్టుకోలేము. మన లోపల ఉన్న బండరాళ్లలాంటి వాసనలను మనచేత బయటకు కక్కించటం ఒక్క గురువుకే సాధ్యం. ఆత్మానుభవం మన ఇంద్రియాలకు అందదు, మనస్సుకు అందదు, మన తెలివితేటలకు అందదు కాని అనుభవానికి అది అందుతుంది. అట్టి అపూర్వమైన ఆత్మానుభవాన్ని మనకు అందించేవాడు ఒక్క గురువు మాత్రమే. ఎన్ని ప్రయత్నాలు చేసినా బయట గొడవల వలన అందేదికాదు, గురువు అనుగ్రహం లేకుండా ఆత్మానుభవం సాధ్యం కాదు.

కొంతమంది అవసరమైతే డబ్బు ఖర్చుపెడతారు, అవసరం లేకపోతే ఒక్కపైసా కూడా ఖర్చుపెట్టరు, అది మంచి అలవాటే. మనం అవసరం లేని గొడవలలోనికి వెళ్ళి ఒక్క తలంపు కూడా ఖర్చుపెట్టకూడదు అని ఒకచోట భగవాన్ అన్నారు. డబ్బు కాదు తలంపు కూడా వేస్టు చెయ్యవద్దు అన్నారు. దానివలన ఆత్మాన్వేషణకు ఉపయోగపడే టైము వృధా అవుతుంది. మీ మనస్సును అస్తమాను పుండు చేసుకోకుండా సమాధానపడాలి. దేవుని కోసం దుఃఖపడేవారు ధన్యులు వారు ఓదార్చబడుదురు అని బైబిల్‌లో చెప్పాడు. మనం లోకంకోసం, గొప్పలకోసం, ఆడంబరాలకోసం ఏడుస్తాము కాని దేవుడికోసం ఏడవము. దేవునికోసం దుఃఖపడేవారు ధన్యులు, వారు దేవుని దయకు పాత్రులు అవుతారు, శాంతిసామ్రాజ్యానికి అధిపతులు అవుతారు. ఆడంబరంగా ఉండకండి, ఆడంబరంగా మాట్లాడకండి, ఆడంబరమైన దుస్తులు ధరించకండి, ఆడంబరమైన పనులు చేయకండి. మీ దగ్గర సొమ్ములు ఉన్నాయని ఆడంబరాలకు వెళ్ళిపోతే అహంభావన పెరిగిపోతుంది, మీ బుద్ధి నాశనమవుతుంది, దైవానికి దూరమవుతారు, అన్నివిధాల భ్రష్టులవుతారు, ఆడంబరం అంతదూరం తీసుకొనిపోతుంది, అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. పూర్వంకంటే ఇప్పడు ఎక్కువమంది దగ్గర డబ్బు

కనిపిస్తోంది కాని పూర్వం ఉన్నంత సహనం ఇప్పుడు లేదు. సహనంలో సుఖం ఉంది, శాంతి ఉంది కాని డబ్బులో సుఖం, శాంతి లేవు. డబ్బు మీ కుటుంబ అవసరాలను తీరుస్తుంది, అంతవరకే కాని డబ్బులో సుఖం, శాంతి లేవు. ఇప్పడు సహనం తగ్గిపోతోంది అందువలన ప్రతీ జీవుడు తొందరగా రియాక్టు అవుతున్నాడు. రాముడికి ఉన్నంత సహనం భూమికి లేదు అని చెపుతారు. రామనామం మనస్సును పవిత్రం చేస్తుంది, రామనామం వల్ల బుద్ధి శుద్ధి అవుతుంది. ఎప్పడైతే బుద్ధి శుద్ధి అయ్యిందో హృదయంలో ఉన్న రాముడి తాలుక రుచి మనకు తెలుస్తుంది. మీకు బయటపరిస్థితులు గొప్పగా ఉంటే ఉండనివ్వండి కాని బుద్ధిని పాడుచేసుకోవద్దు, ఈ పరిస్థితులు అన్నీ చివరకు ఇక్కడే ఉంటాయి. పాడైపోయిన బుద్ధి మాత్రం మీ కూడా వచ్చేస్తుంది, ఇది బాగా గుర్తు పెట్టుకోండి.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 11-03-08, లక్కవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దీపం, దీపం అని నోటితో అంటే వెలుతురు రాదు. దీపం వెలిగించాలి. అన్నం అన్నం అంటే కడుపు నిండదు. మనం అన్నం తినాలి. చదువుకోవాలి, చదువుకోవాలి అంటే చదువు వచ్చేయదు, దానికి తగిన కృషి ఉండాలి. నాకు దేశభక్తి ఉంది, దేశాన్ని ప్రేమిస్తున్నాను అని వూరికే అంటే సరిపోదు, ప్రాక్టికాలిటీ ఉండాలి, నీ వంతు కృషి చెయ్యాలి. ఇతరుల గొడవ మనకు అనవసరం. దేశం కోసం ఎవరి పని వారు చేయాలి. పెద్ద ఇంజను ఉంది అనుకోండి అందులో ఉన్న చిన్న నట్టుకు కూడా విలువ ఉంటుంది. ఇంజనులో ఏ నట్టుకు ఆ నట్టు పని చేస్తేనే ఇంజను తిరుగుతుంది కాని లేకపోతే ఇంజను పని చేయదు. అలాగే దేశంలో ఎవరు ఏ పని చేస్తున్నారో ఆ పాత్ర చక్కగా పోషిస్తేనే దేశం అభివృద్ధిలోనికి వస్తుంది కాని లేకపోతే అభివృద్ధిలోనికి రాదు. అందుచేత మనం జ్ఞానం కావాలి, జ్ఞానం కావాలి అని అంటే వచ్చేయదు, జ్ఞానం సంపాదించటం కోసం మనం సాధన చెయ్యాలి. ఏమి సాధన లేకుండా జ్ఞానం రావాలి అంటే ఎలాగ వస్తుంది. జీవితంలో అభివృద్ధిలోనికి రావాలంటే చదువు ఒక్కటే సరిపోదు, అన్ని కోణాలు వికసించాలి. నాకు కాళ్ళు బాగున్నాయి, చేతులకు పక్షవాతం వచ్చింది అనుకోండి ఏమీ ప్రయోజనం లేదు. మొత్తం శరీరంలోని అవయవాలు అన్నీ బాగుండాలి. అలాగే మీరు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తున్నా సామాజిక స్పృహ కలిగి ఉండాలి. కొంతమందికి ఎంత ఎక్కువ చదువు ఉందో అంత స్వార్థం ఉంటుంది. వారు దేశానికి ఉపయోగపడనక్కరలేదు కనీసం తల్లితండ్రులకు కూడా ఉపయోగపడరు, పెళ్ళాం ఒక్కటే కుటుంబం అనుకొంటూ ఆ పెళ్ళాన్ని వేసుకొని తిరుగుతూ ఉంటారు. మన హృదయం ఎంత పెద్దది అవ్వాలంటే నీ

హృదయంలో దేశాన్ని దాచుకోవటానికి దేశం చిన్నది అయిపోవాలి. కొంతమంది దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా హృదయంలో లయం చేసుకొంటారు, వారిని విశ్వమానవులు అంటారు. వారికి దేశభక్తి ఉంటే దేశం యొక్క క్షేమం ఎలా కోరుకొంటారో కొంతమంది మహర్షులు, మహాత్ములు ప్రపంచం క్షేమం కూడా అలా కోరుకొంటారు. నూటికి నూరుపాళ్ళు ఎవడైతే స్వార్థపరుడో వాడు గ్రామాన్ని ప్రేమించడు, దేశాన్ని ప్రేమించడు, ప్రపంచాన్ని ప్రేమించడు, వాడికి దేవుడు అక్కరలేదు, సమాజం అక్కరలేదు, వాడి పొట్ట తప్పించి ఏమీ వాడికి అక్కరలేదు, అటువంటి వారందరికి చివరకు చీకటిలోకాలు మిగులుతాయి. మనం గాంధీగారిలాగ నూటికి నూరుపాళ్ళు స్వార్థంలో నుండి విడుదల పొందకపోయినా ఎంతోకొంత స్వార్థాన్ని తగ్గించుకొంటే సమాజానికి బాగా ఉపయోగ పడవచ్చు.

సేవాభావం అనేటప్పటికి ఆంజనేయస్వామిని గుర్తుపెట్టుకొంటే ఎంతోకొంత మనం సమాజానికి ఉపయోగపడతాము. ఆంజనేయస్వామికి నిరంతరం భగవంతుడి పని తప్పించి సొంతపని అంటూ ఆయనకు ఏమీ లేదు, అందుచేత మనందరకు ఆంజనేయస్వామి ఆదర్శం. పరమాత్మ పరమాత్మ అంటే పరమాత్మ తెలియబడడు, ఆయనను తెలుసుకోవటానికి కృషిచేయండి. ఆయన మీలోపలే ఉన్నాడు కాబట్టి మీకు తెలియబడతాడు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మీ లక్ష్యం ఏమిటి అంటే పరమాత్మ మీ లోపలే ఉన్నాడు, ఆయనను పొందాలి, అదే మీ గమ్యం. అందుచేత అదృష్టం మనలను వెంటాడుతూ ఉన్నా, దురదృష్టం మనలను వెంటాడుతూ ఉన్నా గమ్యాన్ని మనం మిస్ అవ్వకూడదు. అదృష్టం ఒక స్వప్నమే. దురదృష్టం కూడా ఒక స్వప్నమే. నిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి మేలుకోవటం కాదు, జాగ్రదవస్థలో ఉండగా మీ హృదయంలో ఉన్న సత్యంలోనికి మేల్కోవాలి. దానికి శాస్త్రం సహాయం తీసుకోండి, భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూ హృదయంలో ఉన్న సత్యంలోనికి మేల్కోవటానికి ప్రయత్నం చేయండి, కాలాన్ని శక్తిని వృధా చేసుకోవద్దు. మనిషి అయిన తరువాత ఏవో ఉద్వేగాలు వస్తూ ఉంటాయి, కోరికలు వస్తూ ఉంటాయి. లక్ష్మణుడికి కోపం వచ్చేసి సూర్పణఖ ముక్కు, చెవులు కోసాడు. సీతాదేవి నాకు మాయ లేడి కావాలి అంది, పోనీ ఆవిడ మాయలేడి కావాలి అని అడిగినా రాముడు వూరుకోవచ్చుకదా, ఆ లేడి వెనకాల పరుగెట్టాడు. అంటే మోహాన్ని జయించటం కష్టం సుమా అని చెప్పటం. బయట ఉన్న శత్రువుల కంటే లోపల ఉన్న శత్రువులే మనకు ప్రమాదం. మీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి ఏ ఆటంకాలు అయితే అడ్డువస్తున్నాయో, ఆ శత్రువులను రెండుకళ్ళతో కాదు, వెయ్యి కళ్ళతో అబ్జర్వు చేసి

వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నం చేయండి. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఈ శరీరం భూమి మీదకు వచ్చినప్పుడు పది వాసనలతో వస్తే ఇంకో అయిదు వాసనలు పెంచుకొని చనిపోకండి, ఆ పది వాసనలలో అయిదు వాసనలు అయినా తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యండి, ఎవరిమటకు వారు కృషిచెయ్యాలి, అనుకరణ వద్దు.

శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ భగవంతుడు చెప్పిన మాటలను అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి కాని అనవసరమైన గొడవలలోనికి వెళ్ళి కాలాన్ని, శక్తిని వృథా చేసుకోవద్దు. ఇప్పడే ఇక్కడే ఆత్మజ్ఞానం పొందటానికి మీకు అవకాశం ఉంది. అందుచేత మీరు రాగద్వేషములు పెట్టుకొని కాలాన్ని వృథా చేసుకోవద్దు. రాగద్వేషములు ఉంటే మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. అందుచేత రాగద్వేషములను మేగ్జిమమ్ తగ్గించుకోండి. మీరు వచ్చిన పని మర్చిపోవద్దు. భీష్ముడు కర్ణుడితో మాట్లాడుతూ జరిగిపోయింది ఏదో జరిగిపోయింది నువ్వు పాండవుల తోటి స్నేహంగా ఉండి రాజ్యాన్ని కాపాడు అంటే కర్ణుడు ఏమన్నాడు అంటే నేను ఎంతటి వీరుడనైనా ఈశ్వరసంకల్పమే నెరవేరుతుంది అని చెపుతూ ఒక వాక్యం చెప్పాడు. ఈ వాక్యం మీకు అర్థమైతే మీకు సారో ఉండదు, వేసవికాలంలో ఏ.సి. గదిలో ఉంటే ఆ వేడి ప్రభావం మీ మీద ఎలా ఉండదో, అలాగ మీరు ఎంత వ్యతిరేకపరిస్థితుల మధ్యన ఉన్నా అంత చల్లగా ఉండగలరు. కర్ణుడు చెప్పిన మాట ఏమిటి అంటే తాతగారు ఈశ్వరుడికి ఒక సంకల్పం ఉంది, నాకూ ఒక సంకల్పం ఉంది. నా సంకల్పం ఎలా ఉందో ఈశ్వరుడి సంకల్పం కూడా అలాగే ఉండాలి అని నేను అనుకొంటే ప్రపంచంలో నాకంటే తెలివితక్కువ వాడు, నాకంటే మూర్ఖుడు ఎవడూ ఉండడు అని చెప్పాడు. ఈ వాక్యం మీకు అర్థమైతే పెర్సనల్ టెన్షన్‌లో నుండి, సారోలో నుండి బయటకు వచ్చేస్తారు, అక్కడ మీకు వ్యక్తి కనబడడు. దీనిని బట్టి మనం ఎంత మూర్ఖులమో చూడండి, అందుకే మనకు దుఃఖం వస్తోంది. దుఃఖం రావటానికి బీజం ఎక్కడ ఉందో కర్ణుడు చెప్పాడు. కౌరవులు జయం పొందాలి అనుకొంటున్నాను, ఎందుచేతనంటే అది నా సంకల్పం. కాని ఈశ్వరసంకల్పం నాకు వ్యతిరేకంగా ఉంది కాబట్టి నేను ఎంతటి వీరుడినైనా కాలప్రవాహంలో కొట్టుకొని పోవలసిందే. భగవంతుడి స్వరూపాన్ని ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకొన్నవాడు కర్మరహితుడు అవుతాడు, జన్మరహితుడు అవుతాడు. భగవంతుడికి ఒక రూపం లేదు, ఒక నామం లేదు. నిరాకారంగా ఉన్న వస్తువును ఈ జీవుడు మనస్సుతో చూడలేడు. ఆ నిరాకారంగా ఉన్నవాడే మన యందు ప్రేమ కొలది ఒక రూపం ధరించి వస్తాడు కాని ఆ రూపం నిజం కాదు. భక్తుడికోసం వాడు ఒక రూపం ధరించి వస్తున్నాడు అంతవరకే మనం

తీసుకోవాలి కాని ఆ రూపంలో ఉన్నప్పుడు కూడా ఆ రూపానికి పరిమితమై ఉండడు.

నీ ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి భగవంతుడు అందడు. ఏ ఇంద్రియాలకు అయితే భగవంతుడు అందడో ఆ ఇంద్రియాలతో ఆయనను పట్టుకొంటానంటావేమిటి? ఈ సృష్టినంతా నడిపేవాడు ఒకడు ఉన్నాడు. వాడు నీ కళ్ళకు కనబడడు. నీ బుద్ధికి అందడు అలాగని వాడు లేడు అని అనుకోవద్దు. ఎప్పుడూ కూడా భగవంతుడు ఉన్నాడనే మనం జీవించాలి. భగవంతుడు లేడని జీవిస్తే మరణానంతరం చాలా తిప్పలు పడతావు. భగవంతుడు ఉన్నాడని జీవిస్తాము అనుకోండి, నిజంగా లేడు అనుకోండి, మనకు వచ్చిన నష్టం లేదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయన మొద్దబ్బాయిలా లేడు, ఆయన పనిచేస్తున్నాడు. ఆయన పని చేస్తున్నట్లు ఎవడైతే గుర్తిస్తున్నాడో వాడికి అశాంతి నశిస్తుంది. ఈశ్వరుడు చేస్తున్న పని తాలుక గుర్తింపు ఎవడికైతే ఉందో వాడికి దుఃఖకారణం ఉన్నా దుఃఖం నశిస్తుంది. ఉన్న వస్తువు ఏదో ఉంది, దాని తాలుక ఎరుక, దాని తాలుక గుర్తింపు మనకు ఇంకా రావటం లేదు. మీ క్షేమం మీరు కోరుకోండి అలాగే అందరి క్షేమం కోరుకోవాలి. మోహం నశించిన వాడికి దుఃఖం నశిస్తుంది. మీకు కోట్లాది రూపాయలు డబ్బు ఉంది అనుకోండి, మోహం నశించలేదు అనుకోండి, మిమ్మల్ని దుఃఖం వెంటాడుతుంది, జన్మలు వెంటాడతాయి. నువ్వు ఎవరిని తెలుసుకోవాలను కొంటున్నావో ఆయన దయలేకుండా ఆయన నీకు తెలియబడడు. చంటిపిల్లవాడిని వాడి దగ్గర ఉన్న బిస్కట్ ఇమ్మని అడిగితే వాడికి ఇష్టం లేకపోతే ఇవ్వడు, వాడు ఇవ్వాలి అనుకొంటే మన మీద పడేస్తాడు. భగవంతుడు కూడా అంతే నీకు యోగ్యత వచ్చినప్పుడు, అర్హత కలిగినప్పుడు నీకు వద్దన్నా ఇచ్చేస్తాడు. మనకు అర్హత లేకపోతే కోరుకొన్నా రాదు. మీరు సాధనలో బహుజాగ్రత్తగా ఉండండి. ధర్మరాజు చాలా మంచివాడు. కాని జూదం అనే ఒక్క చెడ్డఅలవాటు వలన రాజ్యం పోగొట్టుకొన్నాడు, అనేక కష్టాలు పడ్డాడు. ధర్మరాజులాంటి మంచివాడికే ఇలా జరిగితే ఇంక మనం సాధనలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియటానికే ఈ మాటలు చెపుతున్నారు. పుట్టెడు తెలివితేటలకంటే ఆవగింజంత అదృష్టం ఉంటే చాలు అని కొంతమంది చెపుతారు. అంటే పుట్టెడు తెలివితేటలు ఉన్నవాడికంటే ఆవగింజంత అదృష్టం ఉన్నవాడు తొందరగా బాగుపడతాడు ఎందుచేతనంటే వాడు చేసిందల్లా కలిసివస్తుంది. కొంతమందికి తెలివి ఉంటుంది, తెలివితేటలు ఉన్నా లాభం లేదు, వాడు చేసింది కలిసి రాకపోతే వాడేం చేస్తాడు.

మీకు అదృష్టరూపంలో వచ్చినవాడూ భగవంతుడే, దురదృష్టం రూపంలో వచ్చినవాడు కూడా భగవంతుడే, అంతా భగవంతుడే, అది మనం గుర్తించాలి. త్యాగానికి కర్ణుడు ముందు

ఎవరూ సరిపోరు. మీరు ఎంత గొప్పవారు అయినా దానం ఇవ్వటంలో కర్ణుడితో సరిపోరు అని పాండవులతో పరమాత్మ అన్నాడు. కర్ణుడి దగ్గరకు ఎవరైనా వెళ్ళి అడిగితే ఆయన దగ్గర ఉండి లేదని ఎప్పుడూ అనలేదు, ఇవ్వటమే, రేపు రండి అనే మాట కూడా లేదు. అటువంటి త్యాగమూర్తి కర్ణుడు. అటువంటివారు కలియుగంలో కూడా ఉన్నారు, ఆయన చిత్తరంజన్‌దాస్. చిత్తరంజన్‌దాస్ జేబులో డబ్బు ఉంటే మన జేబులో డబ్బు ఉన్నట్లే అని కలకత్తాలో ప్రజలు అనుకొనేవారట. ఆయన దగ్గర డబ్బు ఉంటే ఆ తలుపు తట్టినవాడికి ఎవడికీ లేదు అని చెప్పలేదు. ఆ గుణం అందరికీ రమ్మంటే రాదు. డబ్బు ఉన్నవారు అందరూ దానం చేస్తారు అని అనుకోవద్దు. చాలామంది పిసినారులు ఉండవచ్చు. ఆ గివింగ్ హాబిట్ అందరికీ ఉండదు, అది ఒక దైవీగుణం. ఇతరులకు మనం ఏదైనా సహాయం చేస్తే అదంతా పోయింది, పోయింది అనుకొంటాము. మనం చనిపోయిన తరువాత ఉపయోగపడే డబ్బు అదే అని రాజగోపాలాచారి అనేవారు. ఇతరులకు మనం ఏ రూపంలో సహాయం చేసినా అదంతా భగవంతుడు తన బ్యాంక్‌లో వేసి ఉంచుతాడు, మరణానంతర జీవితంలో ఆ డబ్బు మనకు చెల్లుతుంది. ఇక్కడ మనకు వెయ్యి కోట్లు డబ్బు ఉంది అనుకోండి, ఎవడికీ ఒక పైసా ఇవ్వలేదు అనుకోండి, మరణానంతరం మనం బీదవారుగా ఉండవలసిందే అంటున్నారు రాజాజీ.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 10-04-08, విశాఖపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏ మతంలో ప్రయాణం చేసినా ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. సత్యం అనేది ఒక్కటిగానే ఉంటుంది గాని రెండుగా గానీ మూడుగా గానీ ఉండదు, అది మన హృదయంలో ఉంది, బయట ఉంది, అంతటా వ్యాపించి ఉంది. అందరి హృదయాలలో ఉన్న ఆ పరమాత్మ అనుభవం పొందకుండా మనం దుఃఖరహితస్థితిని పొందలేము, పునర్జన్మలలో నుండి విడుదలపొందలేము. అందరిలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను ఎవడైతే అనుభవైకవేద్యం చేసుకొన్నాడో వాడి గురించి ఉపనిషత్తులు ఏమి చెప్పాయి అంటే వాడికి ఇంక దుఃఖం లేదు, వాడికి ఇంక పునర్జన్మలేదు, వాడికి ఇంక టెన్షన్ లేదు, అంటే ఈ నాన్‌సెన్స్ గొడవల నుండి విడుదల పొందుతాడు, స్వతంత్రుడవుతాడు. మన అవతారపురుషులు, మహాత్ములు, ఋషులు అందరూ కూడా మనిషిని దుఃఖం అనేది ఎలా ఉంటుందో తెలియనిస్థితికి తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నం చేసారు. మీకు ఎంత చదువు ఉన్నా, ఎంత ధనం ఉన్నా, లోకానికి సంబంధించిన కీర్తి ఎంత ఉన్నా దుఃఖం వస్తూ ఉంటే

వాటివలన ఏమీ ప్రయోజనం లేదు. ద్వైతంలో నుండి భయం వస్తుంది, ద్వేషం వస్తుంది, కోరిక వస్తుంది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అది మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దానికంటే భిన్నంగా ఏమీ కనబడదు, అందుచేత అక్కడ భయం లేదు, ద్వేషం లేదు, కోరిక లేదు, ఇప్పడు మేము ఏదో చెపుతున్నాము, మీరు వింటున్నారు, అధ్యయనం చేస్తున్నారు. సత్యం అనుభవంలోనికి వచ్చాక ఇంతవరకు మీరు విన్నదంతా మీకే రోత కింద అనిపిస్తుంది అన్నాడు పరమాత్మ. అంటే అప్పడు ఇంక ఏమీ అవసరం ఉండదు, ఇంక వినటానికి ఏమీ మిగలదు, చూడటానికి ఏమీ మిగలదు, ఎటుచూసినా అదే.

ఈశ్వరుడు ఉన్న గుహలోనికి ప్రవేశించాలంటే నీవు కర్త లేని కర్మ చెయ్యాలి, అదే ఫౌండేషన్. కర్తలేని కర్మ చెయటం వలన మనస్సు పవిత్రం అవుతుంది, వాడికి లోపలకు వెళ్ళే దారి కనబడుతుంది. కర్తలేని కర్మ చేయటం ఒక్క జ్ఞానికే సాధ్యం. కర్తృత్వంతో మనం మంచి పనులు చేసినా దాని వలన పుణ్యం వస్తుంది, అది మరల అనుభవంలోనికి వచ్చినప్పడు హృదయంలో కొన్ని బీజాలు విడిచిపెడుతుంది, వాటినే కర్మబీజాలు అంటారు, ఇవి చాలా ప్రమాదం, అవి మరల మొలకెత్తటానికి టైముకోసం చూస్తూ ఉంటాయి. ఆధ్యాత్మికమార్గంలో ఉన్నవారు బహుజాగ్రత్తగా ఉండాలి. రాత్రి తెల్లవార్లు మనం మెలుకువగా ఉంటే మన ఇంటికి ఎవడైనా దొంగవచ్చినా ఇంటిలోనికి రాడు, వెళ్ళిపోతాడు. అలాగే సాధనలో మనం బహుజాగ్రత్తగా ఉంటే, ఎల్లప్పడూ దైవచింతనలో ఉంటే, సత్పురుషుల సహవాసంలో ఉంటే విషయవాసనలు వచ్చినా ఇక్కడ మనకు స్థానం లేదు అని వెళ్ళిపోతూ ఉంటాయి. మనం అజాగ్రత్తగా ఉంటే వచ్చి పట్టుకొంటాయి. మాయ అంతా తీసుకొనివచ్చి దేహగతమైననేనులో పెట్టేసాడు. దేహగతమైననేనులో నుండి విడుదల పొందకపోతే దుఃఖం మనలను విడిచిపెట్టదు. కొంతమంది ఇంటిదగ్గర ఒంటరిగా కూర్చొని మేము బాగానే ఉన్నాము అనుకొంటారు. సమాజంలోనికి వచ్చినప్పడు ఎవడైనా చిన్నమాట అన్నా పడలేరు అంటే వారు కరెక్టు స్టేట్‌లో లేరు. ప్రపంచంతో కలిసిమెలిసి ఉన్నప్పడుకూడా నిర్వికారంగా ఉండగలగాలి. ప్రపంచాన్ని చూసి డిస్టర్బ్ అవుతున్నావు అంటే అక్కడ నీకు ప్రపంచం భిన్నంగా కనిపిస్తోంది అంటే అక్కడ భిన్నత్వం ఉంది కాబట్టి నీవు ఫెయిల్ అయిపోతావు. ప్రపంచంలో ఉన్న అన్ని వికారముల మధ్యన నిర్వికారంగా ఉండగలగాలి. తినే పదార్థములు ఎదురుగా ఉన్నా తిండికి సంబంధించిన కోరిక రాకూడదు. అంతేగాని నక్కలాగ అందని ద్రాక్షపళ్ళు పుల్లన అంటే దానికి అందలేదు కాబట్టి పుల్లన, అందితే తినేస్తుంది, అహంకారం ఏమూల ఎలా విజృంభిస్తుందో చెప్పలేము. ఎదుటివారి బుద్ధితో ఆలోచించక మన బుద్ధితో ఆలోచిస్తే మనలోని బలహీనతలు ఏమిటో మనకు తెలుస్తుంది, అప్పడు వాటిని సరిచేసుకోవాలి. ఆత్మజ్ఞాన సముపార్జనలో మీకు

చెడ్డగుణాలే కాదు మంచిగుణాలు కూడా అడ్డువస్తాయి. వాటిని ఓల్డ్ హేబిట్స్ అనేవారు అరవిందఘోష్. వాటిని మీరు పెంచి పోషించారు కాబట్టి ఆ ఓల్డ్ హేబిట్స్ మీకు అడ్డు వస్తాయి. ముందువాటిని తొలగించుకోవాలి. దానికి సిన్సియారిటీ అవసరం. గొప్పలకోసం చేస్తూ ఉంటే తిప్పలు వస్తాయి. ప్రయత్నం ఎంతవరకు శ్రద్ధగా చేయగలుగుతున్నాము అనేది చూసుకోవాలి. శ్రద్ధ వలన అంతా సాధ్యమే.

మనం పెద్దపెద్ద సాధనలు చేయలేకపోయినా అహంకారాన్ని ఫీడ్ చేయకుండా చూసుకోవాలి. కీర్తికాంక్ష ఉంటే దానికి ఆహారం అందుతుంది. నువ్వు కీర్తిని ఏమి చేసుకొంటావు. మనం ప్రయాణం చేస్తూ ఉంటే రోడ్డు మీద ఉన్న దుమ్ము మన బట్టలమీద పడుతుంది, అలాగ మీకు కీర్తి వస్తే ఫరవాలేదు. మీరు కావాలని కోరి తెచ్చుకోకూడదు, మీరు కోరి తెచ్చుకొన్నది మిమ్మల్ని బంధిస్తుంది. ఎంత గట్టిగా కోరి తెచ్చుకొన్నామో మరల అంత వెనక్కి వెళితేగాని నీ గూటిలోనికి నువ్వు చేరలేవు. ఈశ్వరుడికి భిన్నంగా నేను ఉన్నాను అనే తలంపు పోవటమే నిజమైన శరణాగతి. ఈశ్వరుడు సాధించి పెట్టింది మేము సాధించాము అంటారు. ఈశ్వరుడు సాధించిపెట్టాడు అని తెలియక నేను సాధించాను అంటాడు. సాధించటానికి వాడంటూ ఒకడు ఉన్నాడా? లేడు. అది నీకు అర్థమవ్వాలి. అది అర్థమైతే దుఃఖం అంతా ఆరిపోతుంది, ఏమైనా గర్వం ఉంటే అది కూడా పోతుంది. ఈశ్వరుడికి భిన్నంగా అసలు మనం లేము కాని ఉన్నామని అనుకొంటున్నాము, అదే అహంభావన, అదే వ్యక్తిభావన. ఈశ్వరుడికి భిన్నంగా నేను ఉన్నాను అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సె చెపుతోంది. మనస్సు అనేది అసలు ఉందా, లేదా అని విచారణ చెయ్యి. విచారణ ఎందుకు అంటే అసలు మనస్సు అనేది లేదు అని నీకు తెలియటానికి. లేనిదానిని లెనట్లుగా నీవు గ్రహించగలిగితే ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. మనస్సుతోటి విరోధం పెట్టుకోవద్దు, దానితో స్నేహంగా ఉండి దానిలో నుండి వేరుపడిపో. మీరు అదనంగా పెద్ద కష్టపడనక్కరలేదు, ఇప్పుడు మీరు చేసే పనే గుర్తింపులు కోరుకోకుండా, ఇంపెర్సనల్‌గా చేస్తారు అనుకోండి, ఆ ఇంపెర్సనల్ స్థితికి వెళ్ళిపోతారు. మనకు దుఃఖం వచ్చినప్పుడు ఈశ్వరుడి దయ నామీద లేదు అంటాము. శరణాగతి పొందినవాడు అసలు కంప్లైంట్ చేయడు, ఆయన ఎక్కడ నుంచోబెడితే అక్కడ, ఎలా నుంచోబెడితే అలాగ, అంతేగాని వికారం ఏమీ ఉండదు. హోలీ కంపెనీ మధ్యలో కాదు ముళ్ళకంపల మధ్యన కూడా వికారం లేకుండా ఉండగలగాలి. నీ ఇంద్రియాలకు అందుబాటులో అన్ని భోగాలు ఉండాలి కాని నీకు వికారం రాకూడదు, అప్పుడు నిజమైన స్థితిలో ఉన్నట్లు గుర్తు.

ఈ లోకం అనిత్యం, దుఃఖాలయం అని పరమాత్మ చెప్పాడు. శ్రీకృష్ణ చైతన్య ఏమని చెప్పాడు అంటే ఈ లోకం చూడటానికి బాగానే ఉంటుంది. పామును కూడా నొక్కి చూస్తే మెత్తగా ఉంటుంది కాని దాని నోటినిండా విషమే, అలాగే ప్రపంచం కూడా అందంగా కనిపిస్తుంది గాని ప్రపంచంనిండా విషమే అని చెప్పాడు. భగవాన్‌తో ఎవరైనా మాట్లాడుతూ వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని ఏదో ఒకటి చెపుతూ అది ఏమైనా మిమ్మల్ని ఇబ్బంది పెట్టిందా అనేవారు. ఈ సృష్టిలో నన్ను భయపెట్టేది లేదు, నాకు ట్రబుల్ ఇచ్చేది లేదు. భయాన్ని చూసేవాడు ఇక్కడ లేడు, ట్రబుల్ పడేవాడు ఇక్కడ లేడు, వాడు ఏనాడో చనిపోయాడు, ఇక్కడ ఉన్నవాడు ఎవడో మీకు తెలియదు, నేను చెప్పినా మీకు అర్థంకాదు అన్నారు భగవాన్. దేహము నేను అనేది ఒక తలంపు, దాని మూలం నీలోపలే ఉంది. దానిని లోపలకు విత్‌డ్రా చెయ్యి. అది లోపలకు విత్‌డ్రా అవ్వాలంటే దానికి ఫీడ్ చెయ్యకూడదు. పొయ్యిలో నిప్పు ఉంది అనుకో, అదనంగా పుల్లలు పెట్టకపోతే కొద్దిసేపటికి దానంతట అదే ఆరిపోతుంది. అలాగే దేహము నేను అనే తలంపుకు ఫీడ్ చెయ్యటం ఆపుచేస్తే అది నెమ్మదిగా సన్నగిల్లి రాలిపోతుంది. మీకు సత్యానుభవం కలిగినప్పుడు గీతలో పరమాత్మ చెప్పిన మాటలు 100% నిజమని మీకు అనిపిస్తుంది. అప్పుడు కృష్ణుడు చెప్పిన టీచింగ్ నేను అనుభవిస్తున్నాను అని మీకు తెలుస్తుంది. ఈశ్వరుడితో సంబంధం లేకుండా నా తెలివితో అన్నీ సాధించగలను అని నీ లోపల ఎవడైనా చెపుతూ ఉంటే వాడిని తీసేయటమే సాధన యొక్క లక్ష్యం, అంతకంటే సాధన ఏమీ లేదు. సాధకులు ఏమి చేస్తున్నారు అంటే దానిని మినహాయించి సాధన చేస్తున్నారు, మన సాధనలో దానిని ఇన్‌వాల్వ్ చేయాలి. నీవు సాధన చేసేటప్పుడు నీకు కొన్ని అనుభవాలు రావచ్చు. అక్కడితోటి ఆగిపోవద్దు. ఒకోసారి లోపలనుండి సంతోషం వస్తూ ఉంటుంది, అక్కడితో ఆగిపోవద్దు. ఇంకా లోపలకు వెళ్ళు, ఇంకా లోపలకు వెళ్ళు. నుయ్యి తవ్వేవాడు నాలుగు గడ్డపారలు వేసివదలడు, నీరు పడేవరకు తవ్వుతూ ఉంటాడు. అలాగే నీ హృదయంలో ఉన్న జ్ఞానగంగ నీకు దొరికేవరకూ లోపలకు వెళ్ళు. నువ్వు దేనినైతే పొందుదామనుకొంటున్నావో అది నీకు అందేవరకు లోపలకు వెళుతూనే ఉండాలి, మధ్యలో మహిమలు చేసే శక్తి రావచ్చు, అక్కడ ఆగిపోవద్దు, దేనితోనూ రాజీపడవద్దు. యిది కాదు, యిది కాదు అని వాటిని గెంటుకొంటూ లోపలకు వెళ్ళాలి. సత్యం తప్పించి అంతా నీ మనోకల్పితం. మనస్సు అనే తెరను చింపేస్తే ఏమీ లేదు. నువ్వు నిరంతరం ఆత్మను చింతించటం వలన అది నశిస్తుంది. నిరంతరం ఆత్మను చింతించే శక్తి నీకు లేకపోతే నీకు ఇష్టమైన అవతారపురుషుడినిగాని, గురువునుగాని నిరంతరం చింతించటం వలన కూడా మనస్సు నశిస్తుంది, మొత్తం మీద దానిని తొలగించు కోవటమే మనం చేయవలసిన పని.

మీరు సాధనకు ఎక్కువ టైము కేటాయించుకోండి, బయట గొడవలు తగ్గించుకోండి. దేహప్రారబ్ధాన్ని బట్టి ప్రతీమనిషికి ఏదో ఒక పని ఉంటుంది. భగవంతుడు మీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేయండి, రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా నొల్లుకోవద్దు. చేసేపని కర్తృత్వం లేకుండా చేయండి, ఆ పని భగవంతుడు మనకు కేటాయించాడు కాబట్టి అది భగవంతుడి పని అని అనుకొని చెయ్యండి. ఆత్మబోధ అనే పుస్తకం వ్రాసిన సాయికృష్ణగారు బ్రహ్మచారి. ఆయన ఏమన్నారు అంటే నాన్నగారు నాకు రెండు లక్ష్యాలు ఉన్నాయి 1. బ్రహ్మచర్యం, 2. భగవాన్. బ్రహ్మచర్యం సాధిచాను, ఇంకా భగవాన్ దొరకలేదు అన్నారు. నేను ఏమి చెప్పాను అంటే భగవాన్ దొరకాలి అని మీరు అనుకొంటున్నారు, మరి ఆయన కూడా అనుకోవాలి కదా. మీరు అనుకొంటే సరిపోదు, మీకు తెలియబడాలి అని ఆయన కూడా అనుకోవాలి. భగవాన్ కావాలి అని మీరు అనుకోవటం మానకండి. ఆ అనుకొనే వాడిని ఎప్పుడో మీకు తెలియకుండా భగవాన్ మింగేస్తాడు, మీకు రీలైజేషన్ వచ్చేస్తుంది. సందేహం పెట్టుకోవద్దు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని మీకు సజీవమైన విశ్వాసం ఉంటే మీ ఓల్డ్‌హేబిట్స్ అన్నీ పోతాయి. అవి ఉపకారం చేస్తాయని ఒకనాడు నేర్చుకొన్నారు, ఇప్పుడు అవి అపకారం చేస్తున్నాయి. ఆ ఓల్డ్ హేబిట్స్ మనలను పట్టుకొన్నాయి అని మనం అనుకొంటున్నాము కాని అవి మనలను పట్టుకోలేదు, ఏదో జన్మలో మనమే వాటిని పట్టుకొన్నాము. మన తింకింగ్ కరెక్టుగా ఉండాలి. ఇప్పుడు వాటిని వదిలించుకోవాలి అని చూస్తున్నాము, అవి వదలము అంటున్నాయి. వాటిని పట్టుకొనేటప్పుడు ఎంత ఇష్టంగా పట్టుకొన్నామో అంత ఇష్టం ఈశ్వరుడి మీద పెట్టుకొంటే అప్పుడు ఆ ఓల్డ్ హేబిట్స్ పోతాయి. భగవాన్ చెప్పిన టెక్నిక్ ఇక్కడ ఉంది. మనం కానిదాని గురించి ఆలోచిస్తూ ఉంటే దాని బలం పెరిగిపోతుంది. మనం కానిదాని గురించి ఆలోచించేబదులు మనం ఏదైతే అవునో దాని గురించి ఆలోచిస్తే కానిది కానట్లుగా పోతుంది, ఉన్నదేదో మనకు తెలుస్తుంది.

మనం ఏదో సాధనలు చెయ్యవచ్చు. కేవలము మన సాధనల వలన సంసార వాసన పోదు. కోటి సాధనల కంటే లిప్తమాత్రం గురువు అనుగ్రహం సరిపోతుంది. వాడి దగ్గరకు మనం వెళ్లటం కష్టం, వాడి ఎడ్రసు మనకు తెలియదు, మన ఎడ్రసు వాడికి తెలుసుకాబట్టి వాడు వచ్చేస్తాడు. ఉన్నది బ్రహ్మమే, ఉన్నది ఈశ్వరుడు కాని నువ్వు కూడా ఉన్నానని అనుకొంటున్నావు. ఆ ఉన్నవాడు ఎవడో చూసుకో, వాడు ఎవడో నువ్వు పరిశీలనగా చూసుకొంటే అసలు వాడు లేడన్న సంగతి నీకు తెలుస్తుంది. అప్పుడు నువ్వు ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒడ్డుకు వచ్చేస్తావు. మీరు ఏదో సరదాగా వింటున్నారు, గురువు అప్పడే మీకు నిప్ప పెట్టేసాడు. ఇంక తగలబడటానికి కొంతటైము

పడుతుంది. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మీలో ఉన్న అజ్ఞానాన్ని భస్మం చేసి విడిచిపెడుతుంది. సగం దూరం వచ్చాక ఈ జ్ఞానం గొడవ మాకు వద్దు బాబోయ్ అంటారు అయినా అది మిమ్మల్ని విడిచిపెట్టదు. అది మిమ్మల్ని శుభ్రంగా కడిగి ఆత్మ ఎంత పవిత్రమైనదో మీ మనస్సును అంత పవిత్రం చేసి అది ఆత్మాకారం చెందేవరకు గురువు అనుగ్రహం విడిచిపెట్టదు. భార్యభర్తల సంబంధం అది మానసిక పరిధిలోనిది. స్వతంత్ర్యంగా ఉండేది, మానసిక పరిధిలో లేనిది గురువు అనుగ్రహం ఒక్కటి మాత్రమే. మీ పిల్లవాడు బాడి చేసుకొంటే వాడిని శుభ్రంగా కడిగి వాడిని మీరు ఎత్తుకొని ఎలా ముద్దు పెట్టుకొంటారో అలాగే ఒకవేళ మీరు బేడ్ హేబిట్స్‌లోనికి వెళ్లినా మిమ్మల్ని కడిగి శుభ్రం చేసి వాటినుండి మిమ్మల్ని దూరం చేసి మీరు ఆయనను మర్చిపోయినా గురువు మిమ్మల్ని మరిచిపోకుండా మీరు ఏ జన్మలో ఉన్నా సరే ఆయన స్వరూపాన్ని మీకు ఇచ్చేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు గురువు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 13-04-08, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు ఉన్న ధనం కంటే, సామాజికమైన కీర్తికంటే, చదువుకంటే, జీవితంలో అన్నింటికంటే క్రమశిక్షణకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. మనస్సుకు క్రమశిక్షణ లేకుండా అది ఏ మూలంలో నుండి వస్తోందో అక్కడికి దానిని పంపలేము. మీకు సవినయంగా, సుస్పష్టంగా మనవి చేసేది ఏమిటి అంటే అవుట్‌సైడ్ గొడవలవలన ఎవరికీ మోక్షం రాదు. బాహ్యంగా ఏదో గుడికట్టించాము, బడికట్టించాము, ఏవో మంచిపనులు చేసాము అంటే వాటివలన మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మంచిపనులు చేయటం, మంచిగా ఉండటం వలన మానసికమైన శుద్ధి కలుగుతుంది. అంతమాత్రంచేతనే జ్ఞానం కలుగదు. ఆ పని చేసేటప్పుడు మన తలంపు ఎలా ఉంది. ఏదైనా ఒకమాట మాట్లాడితే, చేతితో ఒక పనిచేస్తే, ఒక సంకల్పం వస్తే అక్కడ ఇవి అన్నీ వ్యక్తిభావనతో చేస్తున్నామా, ఆ ఇండివిడ్యువల్‌ను మరిచిపోయి చేస్తున్నామా అనేది ఈశ్వరుడు చూస్తాడు. భగవంతుడు మాకు అన్యాయం చేస్తున్నాడు అని చాలామంది అంటారు. భగవంతుడు ఎవరికీ అన్యాయం చెయ్యడు. అలా అన్యాయం చేస్తూ ఉంటే వాడు భగవంతుడే కాదు. భగవంతుడు అందరికీ న్యాయమే చేస్తాడు కాని అది మీ తలంపుకు నచ్చకపోతే, దానిని స్వీకరించే శక్తి మీకు లేనప్పుడు అది అన్యాయం, అన్యాయం అని అనుకొంటాము. మీ జీవితం, నా జీవితం, మొత్తం ఈ సృష్టి అంతా కూడా భగవంతుడి సంకల్పం ప్రకారమే నడుస్తుంది. భగవంతుడి సంకల్పాన్ని కాదని మనం ఏమీ చేయలేము. ఉన్నది ఆయన ఒక్కడే. భగవంతుడికంటే మనం వేరుగా

ఉన్నాము, ఆయనను కాదని మనం ఏదో సాధించగలము అనే వ్యక్తిభావన మనకు ఉంది కాబట్టి సాధన చేసి దానిని తొలగించుకో అని చెపుతున్నారు కాని వ్యక్తిభావన లేకపోతే అసలు సాధనతో పని లేదు. మనం ఏదిగా ఉన్నామో దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము అంటే మనలను మనమే తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము, మాయ అంటే ఇదే. మనిషి ఏ పని చేసినా ఆనందం కోసమే చేస్తాడు. పెళ్ళి చేసుకొంటే ఆనందం కోసం చేసుకొంటాడు, డబ్బు సంపాదిస్తే ఆనందం కోసం సంపాదిస్తాడు, అధికారం సంపాదిస్తే ఆనందం కోసం సంపాదిస్తాడు, ప్రతీమనిషి ఆనందం కోసమే పనిచేస్తాడు కాని వాడికి ఆనందం దొరకదు. ఎందుచేతనంటే అక్కడ ఆనందం లేదు కాబట్టి. మనిషి ఆనందం కోరుకోవటంలో తప్పు లేదు కాని అది ఎక్కడ ఉందో అక్కడ వెదికితే దొరుకుతుంది కాని అవుట్‌సైడ్‌లో ఎక్కడా ఆనందంలేదు. మీకు ఏదైనా అదృష్టం వచ్చినప్పుడు సంతోషం వస్తుంది, దురదృష్టం వచ్చినప్పుడు బాధ వస్తుంది. అసలు ఈ సంతోషం, బాధ అనేవి లేవు, ఇవి అన్నీ ఎమోషన్స్. జీవితం అంతా ఎమోషన్స్ తప్పించి ఏమీ లేదు. మనకు ఏది వచ్చినా భగవంతుడి ప్రసాదమే, కాని మన తెలివితేటలవలన అది సాధించాము అనుకొని లోపల నష్టపోతున్నాము. బయట వేడిగా ఉంది అనుకోండి, మనం ఎసి. గదిలో కూర్చుంటే చాలా చల్లగా ఉంటుంది. అలాగే మీకు ఆత్మజ్ఞానం కలిగితే బయట పరిస్థితులు నూటికి నూరుపాళ్ళు వ్యతిరేఖంగా ఉన్నా మీ మనస్సు ఎసిలో ఉన్నట్లు ఉంటుంది. సబ్జక్టు మీకు అర్థమైతే మిమ్మల్ని దురదృష్టం వెంటాడుతున్నా మీ మనస్సుమటుకు ఎసిలో ఉన్నట్లు ఉంటుంది. ఎందుచేతనంటే అది లోపల నుండి సుఖం, శాంతి తీసుకొంటూ ఉంటుంది.

కర్మ రహస్యం తెలుసుకొని పనిచేస్తే కోరికలు తగ్గుతాయి. పనిచేసేటప్పుడు పని పని కోసమే చేయాలి. వచ్చేది వస్తుంది, రానిది రాదు, ఫలితంకోసం ఎదురుచూడకు. మీరు సాధనలు చేసుకొంటున్నారు, సత్పురుషుల సహవాసం చేస్తున్నారు, పూజలు జపాలు చేస్తున్నారు వీటి అన్నింటి యొక్క ప్రయోజనం మనస్సును శుద్ధి చేసుకోవాలి. స్నేహాలు ఎక్కువగా ఉన్నా బంధం వస్తుంది, విరోధాల వలన కూడా బంధం వస్తుంది. ఎవరైనా మనలను విరోధి అనుకోవచ్చు కాని ఫలానా వ్యక్తి మనకు విరోధి అని మనం అనుకోకూడదు. మన హృదయంలో ఏ సత్యమైతే ఉందో దాని తాలుక ఎరుక మీకు వచ్చిన తరువాత ఈ శరీరానికి చావు వస్తే మనం ఇంక ఏడవము, చావును కౌగిలించుకొంటాము. ఎందుచేతనంటే ఈ దేహం చనిపోయినా మనం ఉంటాము అన్న సంగతి మనకు తెలుస్తుంది, అప్పడు మరణానికి సంబంధించిన భయం ఉండదు. ప్రపంచంలో ఉన్న దుఃఖం అంతా కర్తృత్వంలో పెట్టాడు. ఇది

నావల్ల అవుతోంది, ఇది నేను చేస్తున్నాను అంటావు నువ్వంటూ అసలు ఒకడవు ఉన్నావా? వాడు నిజంగా లేడు, కాని ఉన్నాడు అని నీవు అనుకొంటున్నావు కాబట్టి వాడిని తొలగించుకోవటానికి సాధన చెయ్యి. స్వభావం మార్చుకోవటం చాలా కష్టం, స్వభావం మారాలంటే అలవాట్లు మారాలి, రాంగ్ తింకింగ్ మారాలి, నీవు వేరు నేను వేరు అనే బేదబుద్ధి తగ్గాలి. స్వభావం మారకుండా ఆత్మజ్ఞానం కలుగదు. ఇప్పడు మనకు దేహంతోటి, మనస్సుతోటి ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ మన హృదయంలో ఉన్న వస్తువుతో తాదాత్మ్యం వచ్చేవరకు మనకు ఆనందం లేదు, శాంతి లేదు, సుఖం లేదు, మనకు అక్కడకు చేరుకోవాలి. అక్కడకు చేరాలంటే మనకు కూల్‌మైండ్ ఉండాలి, క్వయిట్‌మైండ్ ఉండాలి. మన మనస్సు మనకు విరోధంగా ఉండకూడదు, మనకు స్నేహితుడిగా ఉండాలి. మీకు జీవితంలో అనేక అవమానాలు ఎదురవుతాయి, అనేక అగౌరవాలు వస్తాయి, మీరు మంచి చేసినా ఇతరులు తిడుతూ ఉంటారు, ఇవన్నీ భరించగలగాలి. ప్రకృతి ద్వారా మనకు కొన్ని ఇబ్బందులు రావచ్చును, మనుషుల ద్వారా కొన్ని ఇబ్బందులు రావచ్చును, అవన్నీ తట్టుకోగలగాలి, డిప్రెషన్‌లోనికి వెళ్లకూడదు, డిప్రెషన్ కూడా ఒక ఎమోషన్.

సాధనకు ఫౌండేషన్ ఏమిటి అంటే శాంతచిత్తం కలిగిఉండాలి. మన డ్యూటీ ఏదో మనం నిర్మలంగా చేసుకొంటూ ఉండాలి. మీరు కర్తృత్వం పెట్టుకొన్నా జరిగేది ఈశ్వరసంకల్పమే. రైలులో ప్రయాణం చేసేవాడు రైలుకు బరువు ఎక్కువ అయిపోయింది, రైలు నన్ను మోస్తోంది, పెట్టెనూ మోస్తోంది, రైలుకు బరువు తగ్గించాలి అని ఆ పెట్టెను నెత్తిమీద పెట్టుకొన్నాడు. నెత్తిమీద పెట్టుకొన్నప్పడు కూడా ఎవరు మోస్తున్నారు, ఆ పెట్టెను రైలో మోస్తోంది. పెట్టెను కింద పెట్టేసుకొన్నాడు అనుకోండి, అప్పడు ఎవరు మోస్తున్నారు రైలే మోస్తోంది, అయితే ఇతను సుఖంగా ఉండవచ్చు. పెట్టె నీ నెత్తిమీద పెట్టుకొన్నట్లు నువ్వు కర్తృత్వం పెట్టుకొన్నా జరిగేది నీ సంకల్పం కాదు, ఈస్వరసంకల్పమే జరుగుతుంది. కర్తృత్వం లేకుండా ఉంటారు అనుకోండి, ఆనందంగా ఉంటారు, వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. కర్తృత్వం ఒకవేళ పెట్టుకొన్నా అదనంగా ఏదీ రాదు. మీరు మంచి పనులు చేస్తున్నారు, జపాలు ధ్యానాలు చేస్తున్నారు, అహంకారాన్ని మినహాయించి ఇవి అన్నీ చేస్తున్నారు. సాధన చేసి దేనినైతే తొలగించుకోవాలి అనుకొంటున్నారో దానిని సాధనలో ఇన్వాల్వ్ చేయటంలేదు, ఇంక అది ఎలా పోతుంది. మనలను పాడుచేయటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి, దేనికి మనం గురికాకూడదు. మనలో ఏ బలహీనత ఉందో అదే మనకు గొప్పగా కనిపిస్తుంది. నీకు డబ్బు అంటే ఇష్టం అనుకో, డబ్బు తప్పించి ఈ

లోకంలో ఏమీ లేదు అనుకొంటావు. అసలు బయట ఏమీ లేదు నీలోపల ఉన్నదే బయట కనిపిస్తోంది. ప్రపంచం నీ బలహీనతలను చూపిస్తుంది. ఆ బలహీనతలను ప్రపంచం తొలగించదు, నీవు సాధన చేసి వాటిని తొలగించుకోవాలి. మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే జీవితంలో యాక్షన్ ఉండాలి గాని రియాక్షన్ ఉండకూడదు. మనం పనిచేస్తూ ఉండాలి, ఆ పని మనలను బంధించకూడదు. మనం చేస్తున్నపని మనలను బంధించకుండా చూసుకోగలిగితే అది కర్మయోగం అన్నారు, అది నిన్ను అజ్ఞానంలో నుండి బయటకు తీసుకొని వస్తుంది. కర్మఫలం పట్ల అపేక్ష పెట్టుకోవద్దు. కర్మఫలం ఆశించవద్దని చెపుతున్నాను కదా అని అసలు కర్మ అంటే విరక్తి పెట్టుకోవద్దు. పని మానివేస్తే జ్ఞానం ఎలాగూ రాదు, నీకు సోమరితనం వస్తుంది. అందుచేత నీవు చేసుకొనే పని ఏదో శ్రద్ధగా చేసుకో, లీవ్ ద రెస్ట్ టు గాడ్ అంటే మిగిలినది భగవంతుడికి వదిలెయ్యి. అది కర్మ సిద్ధాంతం. మనం ఏమి చేస్తాము అంటే మన చేతిలో ఉన్న పని మానేసి దేవుడు ఇచ్చేదాని గురించి ఆలోచిస్తాము.

మీకు ఒకోతలంపు వస్తే సంతోషంగా ఉంటుంది, ఒకో తలంపు వస్తే దుఃఖంగా ఉంటుంది. ఏ తలంపును అయితే ఇది వద్దు, ఈ తలంపు నాకు రాకూడదు అని మీరు అనుకొంటారో అది వచ్చినప్పుడు మీకు దుఃఖం వస్తుంది, ఆ తలంపును వెల్‌కమ్ చేస్తూ ఉంటే అది కూడా సంతోషాన్ని తీసుకొని వస్తుంది. రెండూ అబద్ధాలే, అది మంచితలంపు అయినా, చెడు తలంపు అయినా రెండూ అబద్ధాలే, ఏ తలంపు వచ్చినా కూడా నీ స్వరూపం నుండి నువ్వు దూరమైపోతావు. ఊరికే నీ పేరు స్మరించాను చీకటిలో నుండి వెలుతురులోనికి, అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి జంప్ చేయటం జరిగిపోయింది అన్నారు అక్షరమణమాలలో భగవాన్. అంటే దీని అర్థం ఏమిటి అంటే కోటి సాధనల కంటే, కోటి విద్యల కంటే, కోటి గ్రంథాలు చదవటం కంటే లిప్తమాత్రం గురువు అనుగ్రహం సరిపోతుంది మనం తరించటానికి. మనం బాగుపడటానికి ఒన్ లుక్ ఈజ్ ఎనఫ్, ఒన్ టచ్ ఈజ్ ఎనఫ్, వన్ వర్డ్ ఈజ్ ఎనఫ్. మన అందరి శరీరాలు ఇక్కడే ఉన్నాయి కాని మన మనస్సు ఇక్కడ లేదు అనుకోండి దానికి మమకారం ఒక్కటే కారణం. మీకు ఎక్కడైతే మమకారం ఉందో మనస్సు అక్కడకు వెళ్ళి వాలుతుంది. మమకారం లేకపోతే శరీరం ఎక్కడ ఉంటే మనస్సు అక్కడే ఉంటుంది. ఎవరికైనా ఏదైనా సహాయం చెయ్యాలంటే చెయ్యవచ్చు కాని అక్కడ మమకారం పెట్టుకోకూడదు. మీ మనస్సు ఎక్కడికైతే పోతోందో అక్కడ నుండి విత్‌డ్రా చేయరు అనుకోండి దానికి లోచూపు కలుగదు, మనస్సుకు లోచూపు రాకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఎప్పడు కూడా సాధకులకు నాన్‌యింటర్‌ఫియరెన్స్ ఫాలసీ

మంచిది. అవసరంలేని గొడవలలోనికి వెళ్లకూడదు. అవసరం లేని గొడవలలోనికి వెళ్లేకొలది అహంకారం పెరిగిపోతుంది. అయితే మన దేహప్రారబ్దంలో ఉన్న పని ఇష్టంగా చెయ్యాలి, అయిష్టంగా చెయ్యకూడదు. ఇష్టంగా చేస్తే పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు. మనం చేసేపని అయిష్టంగా చేస్తాము. దాని వలన చాకిరీ ఎలాగు తప్పదు, పాతవాసనలు పోవు, కొత్తవాసనలు వచ్చి మీదపడతాయి. మీరు సాయంత్రం పడుకునేముందు ఓం నమఃశివాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో భగవతే శ్రీ రమణాయ ఇలా మీకు ఇష్టమైనది ఏదో ఒకటి అనుకోండి. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. ఇలా మీకు ఇష్టమైన భగవంతుడి నామాన్ని జపించటం వలన ఆ మంత్రం మిమ్మల్ని అసత్యానికి దూరం చేస్తుంది. జపధ్యానములు చేస్తూ ఉంటే మీకు అవసరం లేని తలంపులు రావు. మిమ్మల్ని అవసరంలేని తలంపుల నుండి, అసత్యం నుండి దూరం చేసి సత్యం దగ్గరకు జరిపేదే నామజపం, జపధ్యానముల యొక్క ప్రయోజనం అదే. మీకు ఎవరికైనా శాంతి లేదు అనుకోండి బాహ్య పరిస్థితులు బాగాలేవు కాబట్టి మేము అశాంతిగా ఉన్నాము అనుకోవద్దు. శాంతి అనేది బయటలేదు, అది నీ లోపలే ఉంది. బయటి వారు నిన్ను మంచివాడు అన్నా ఆ మాటతో కలవకూడదు, చెడ్డవాడు అన్నా ఆ మాటతో కలవకూడదు. బయట మాటలతో కలవకూడదు, ఆ మాటలు వినకూడదు. ఆత్మజ్ఞానసముపార్జనకు పనికిరాని మాటలు వినకూడదు, మాట్లాడకూడదు.

మీరు బయట ఏదో చేశారని దాని వలన మీకు మోక్షం వస్తుందని అనుకోవద్దు. దానికి దీనికి ఏమీ సంబంధం లేదు. మీరు లోపల ట్రైనింగ్ అవ్వాలి. మనలో ఉన్న పాతవాసనలు పోవాలి, కొత్తవాసనలు కలవకుండా ఉండాలి. లోకంలో మనం ఎవరితో అయినా మాట్లాడినా, ఒక పని చేసినా, సాధన చేసినా లోపల మనం పొందవలసింది పొందాలి, అదే మన గమ్యం, అది గుర్తులో పెట్టుకోండి. ఆత్మజ్ఞాన సముపార్జనకు అవసరమైతే భూమి యొక్క అంచులదాకా నువ్వు ప్రయాణం చెయ్యటానికి సిద్ధంగా ఉండు అన్నాడు ఐన్‌స్టీన్. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి. ఆ కష్టం ద్వారా నీలోని చెడ్డ అలవాట్లను తీసేయటానికే ఆ కష్టం పెడుతున్నాడు, అంతేగాని దేవుని అనుగ్రహం లేక కాదు. మీ వాసనలు పిండేసి మీ నోటిద్వారా కక్కించటానికే మిమ్మల్ని ఆ కష్టంలో పెట్టాడు. మంచివారికే ఎక్కువ కష్టాలు వచ్చినట్లు మనకు కనిపిస్తాయి. కారణం ఏమిటి అంటే భగవంతుడు అనుకొంటాడట ఇంకో వంద జన్మలలో అనుభవించవలసిన కర్మ ఈ జన్మలోనే అనుభవింపచేయాలి అనుకొని ఒకటి తరువాత ఒకటి అనుభవించేసి ఇదే ఆఖరిజన్మకింద చేసి మోక్షం ఇచ్చేస్తాడు. మీరు మోక్షం కోసం ఎదురుచూడవద్దు, అదే

వచ్చేస్తుంది. దేవుని సంకల్పమే తన సంకల్పం అనుకొనేవాడికి ఇంక దుఃఖం లేదు. ఎక్కడో లిబరేషన్ దాకా అక్కరలేదు, ఇక్కడ కొంతసేపు మమకారం వదిలేసి చూడండి, ఎంతశాంతిగా ఉంటుందో మీకే తెలుస్తుంది. బయట కారణాల వలన ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి, దానిని తీసుకోవద్దు. బయట గొడవలన్నీ బయట వదిలేయకుండా లోపలికి మింగేయటం వలన ఇంకా పాడైపోతున్నాము. మీరు ఆర్టిఫిషియల్ లైఫ్‌ని కనుక వదిలేస్తే జ్ఞానం దగ్గరకు మనం వెళ్లటం కాదు, జ్ఞానమే మన దగ్గరకు వస్తుంది. మన శరీరం చనిపోయేరోజుకు నూటికి నూరుపాళ్ళు శాంతిగా సుఖంగా ఉన్నారు అనుకోండి, బాహ్యపరిస్థితులతోగాని, మీ కుటుంబ పరిస్థితులతోగాని సంబంధం లేకుండా మీరు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నారు అనుకోండి మీకు పునర్జన్మ లేదు. మనకు ఏడవవలసిన ఏడుపు మిగిలిపోయినప్పడే పునర్జన్మ వస్తుంది, మీరు 100% ఆనందంగా ఉంటే పునర్జన్మతో పనిలేదు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 14-04-08, పాలకోడేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాముడి నామాన్ని స్మరించుకోవటం వలన, రాముడి రూపాన్ని ధ్యానించటం వలన మనకు హృదయం విశాలమవుతుంది, మనస్సు పవిత్రం అవుతుంది, బుద్ధి ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉంటుంది. రాముడిని మర్యాద పురుషోత్తముడు అంటారు. రామ నామాన్ని తారకనామం అంటారు అంటే మనలను తరించే నామం. విష్ణుసహస్ర నామాలు చేసే శక్తి మీకు లేకపోతే ఒక్క రామనామం చాలు అంత ఫలితం వస్తుంది. సర్వసాధారణంగా మనం ఏమి చేస్తాము అంటే మన సుఖం కోసం ఇతరుల సుఖాలను పోగొడతాము కాని రాముడు అలా కాదు ఇతరుల సుఖంకోసం తన సుఖాన్ని వదులుకొనేవాడు, వాడే రాముడు. శ్రీరామనవమిని శ్రద్ధగా చేసేవారికి, రామనామం శ్రద్ధగా చేసేవారికి ధనం, సుఖం రెండూ వస్తాయని సాంప్రదాయంలో ఉంది. రామాయణం శ్రద్ధగా చదివేవారికి ధనం వస్తుందని, భారతం శ్రద్ధగా చదివేవారికి జయం కలుగుతుందని, భాగవతం శ్రద్ధగా చదివే వారికి వైరాగ్యం వస్తుందని హిందూ సాంప్రదాయంలో చెపుతారు. రక్షించేది రామాయణం అని చెపుతారు. ఏకాగ్రత ఎలా ఉండాలి, సత్యాన్ని ఎలా అంటిపెట్టుకొని ఉండాలి ఇవన్నీ రామాయణంలో చాలా వివరంగా చెప్పాడు. కొంతమంది పరిస్థితులు బాగా ఉన్నప్పడు బాగానే ఉంటారు, కష్టాలు వచ్చినప్పడు చెదిరిపోతూ ఉంటారు, ఇవన్నీ ఎలా తట్టుకోవాలో మీకు రామాయణంలో చూపిస్తారు. హనుమాన్ గొప్ప సుందరుడు, రెండు కళ్ళు కాదు మనం వెయ్యి కళ్ళు పెట్టుకొన్నా వాడి సౌందర్యాన్ని చూడటానికి సరిపోవు. అటువంటి

సుందరుడు. అందుచేత ఆ కాండకు సుందరకాండ అని వాల్మీకి పేరు పెట్టాడు. రాముడికి జ్ఞానం ఉందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఆయన ఏమి చెప్పారు అంటే ఆయన నామం స్మరిస్తూ ఉంటే మనకు జ్ఞానం వస్తూ ఉంటే ఆయన జ్ఞానం లేకుండా ఎలా ఉంటాడు అన్నారు. దేవతలలో ఎవరికీ లేని కీర్తి రాముడికి వచ్చింది, ఆయన నవమి రోజున జన్మించారు. నవమి రోజున పుట్టినవారికి ఎక్కువ కీర్తి వస్తుందని, ధనవంతులవు తారని చెపుతారు. సొంతబుద్ధి మనలను సుఖపెడుతుంది, పరాయిబుద్ధి ప్రమాదాన్ని తీసుకొని వస్తుంది. మనకు సలహా చెప్పేవారిలో ఎంతమంది మనలను ప్రేమిస్తారు, మనకు కష్టం వస్తే అందులో ఒకడు కనిపించడు. మనం చెడ్డమాటలు వినటం వలన ఒకసారి ఆ మాటలను మనం తోసేసినా ఆ చెడ్డమాటలు తరచుగా వినటం వలన మన బుద్ధి పాడైపోతుంది. వారు చెడ్డవారు, వీరు చెడ్డవారు అని అనుకొంటూ అలా చెడ్డవారిని చూస్తూ ఉంటే మీరు ఎవరినైతే చెడ్డవారు అనుకొంటున్నారో వారికంటే ఎక్కువ చెడ్డబుద్ధి మీకు వచ్చేస్తుంది ఎందుచేతనంటే నువ్వు అదే చింతిస్తున్నావు కాబట్టి. నువ్వు ఏది చింతిస్తే అదే అవుతావు.

స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. పూర్వపుణ్యం లేకుండా మనకు మంచిస్నేహాలు దొరకాలన్నా అది సాధ్యం కాదు అని ఆచార్యులవారు చెప్పారు. రాముడిలో గొప్పతనం ఏమిటి అంటే ఆయన ఒక మహారాజు యొక్క కుమారుడు, ఇంకో మహారాజుకు అల్లుడు అయినప్పటికీ ఎవరైనా మహాత్ములు ఉంటే వారి దగ్గరకు వెళ్ళి దర్శనం చేసుకొనేవాడు, పెద్దల దర్శన మాత్రంచేత పుణ్యం వస్తుంది. రాముడు మహావీరుడు. ఆయన ఎత్తిన చెయ్యి దింపకుండా 14వేల మంది రాక్షసులను చంపాడు, వాడు రాముడు. కృష్ణుడి దగ్గర యుక్తి ఉంది, ఈయన దగ్గర యుక్తి లేదు, యుద్ధం అంటే యుద్ధమే. కృష్ణుడిది లీలావతారం, రాముడిది ధర్మావతారం. రెండు అవతారాలు మనకు అవసరమే. దేవుడు మానవుడిగా వచ్చినప్పడు ఎలా వ్యవహరిస్తాడో రామావతారం చూడాలి, దేవుడు దేవుడిగా వస్తే ఎలా ఉంటాడో అది కృష్ణావతారం. మారీచుడు బంగారు లేడి కింద రావటం, సీతమ్మ ఆ లేడి కావాలని అడగటం, ఇదంతా సీతారాములు ఎందుకు వచ్చారో ఆ పని పూర్తి అవ్వటానికి విధి అలా గెంటుకు వెళుతుంది. సీతమ్మ లక్ష్మణుడిని నానామాటలు అనటం, రాముడికి ప్రమాదం వచ్చిందేమోనని లక్ష్మణుడు వెళ్ళటం, ఈలోపుగా రావణుడు వచ్చి సీతమ్మను తీసుకొనిపోవటం జరుగుతుంది. రావణాసురుడు సీతమ్మను తీసుకొనిపోయేటప్పడు జటాయువు అనే పక్షి అడ్డుకొంటుంది, నిష్కామకర్మ అంటే అది. జటాయువు రావణాసురుడితో

గట్టిగా పోరాడింది, చివరకు దాని రెండు రెక్కలు కొట్టేస్తాడు రావణాసురుడు, అయినా వీరోచితంగా పోరాడింది. ధర్మయుద్ధం అంటే అది. స్వార్థం లేకుండా ఒక స్త్రీని రక్షించటం కోసం పోరాడింది. జటాయువును మనం మరిచిపోకూడదు, జటాయువు మనకు గురువు. అది పక్షే అవ్వటానికి కాని స్వార్థం లేకుండా, ఒక మంచి కార్యం చేయటానికి తన ప్రాణం వదిలేసింది, అదే జటాయువు. మనం తరించటానికి ఒక్క నామం చాలు. మహాత్మాగాంధీగారు రామనామం, భగవద్గీత ఈ రెండూ తప్పించి ఏదీ ముట్టుకోలేదు. చదువుకొంటే భగవద్గీత చదువుకోవటం లేకపోతే రామనామం చేసుకోవటం. రకరకాల మనుషులను ఐకమత్యంగా నడిపేశక్తి రామనామం వలన వచ్చింది అని బాపూజీ చెప్పారు. మీకు కామబుద్ధి నశించాలంటే రామనామం చెయ్యి అని వివేకానంద చెప్పాడు.

మీరు పూజ చేసుకొంటే లఘుపూజ చేసుకోండి అంతేగాని ఇంట్లోవారిని ఇబ్బంది పెడుతూ ఉదయం మొదలుపెట్టి సాయంత్రం దాకా కూర్చోవద్దు. మీ డ్యూటీ మీరు చెయ్యండి. మీ పని మీరు చేసుకొంటూ మోక్షం పొందాలంటే మీరు మాట్లాడేమాట స్వార్థం లేకుండా మాట్లాడండి, చేసే పని స్వార్థం లేకుండా చేయండి, భగవంతుడు మీకు బుద్ధిని ఇచ్చాడు కదా ఆ బుద్ధితో స్వార్థం లేకుండా ఆలోచించండి, మీకు మోక్షం వచ్చితీరుతుంది అన్నాడు. రావణాసురుడు సీతమ్మ దగ్గరకు వెళ్ళి నువ్వు రాముడు, రాముడు అంటావు ఏమిటి? నన్ను ప్రేమించు, నన్ను పెళ్ళి చేసుకో అని రోజూ వెళ్ళి అడుగుతాడు. సీతమ్మ ఏమి చెప్పింది అంటే హిందూ ధర్మశాస్త్రం ప్రకారం నాకు పెళ్ళి అయిపోయింది, రాముడికిచ్చి పెళ్ళిచేసారు, ఇప్పటికే నేను ఒక పురుషుడికి భార్యని. ఆల్‌రెడీ ఒక పురుషుడికి భార్యను అయినప్పుడు అదంతా మార్చేసుకొని ఇప్పుడు నీకు భార్యగా ఎలా ఉండగలను, అలా ఉండటం ఎలా సాధ్యం అని చెప్పింది. విధి బలీయమైనది. విధి వక్రీకరిస్తే సామ్రాజ్యాలే కొట్టుకొనిపోతాయి. నథింగ్ ఈజ్ టూ హెవీ ఫర్ ద డెస్టినీ. నువ్వు ఏనుగు అయినా నీకు రోజులు అనుకూలంగా లేకపోతే పీనుగు అయిపోతావు, మీకు వేలకోట్ల డబ్బు ఉన్నా అది పోవటానికి పది రోజుల్లో పోతుంది. కృష్ణుడికి వెన్నదొంగ అని పేరు. వాడు వెన్నపూస దొంగతనం చేసాడు అంటే దాని అర్థం ఏమిటి అంటే వెన్నపూస ఎంత మృదువుగా ఉంటుందో మీ మనస్సు కనుక అంత మృదువుగా అయితే మీ మనస్సును దొంగతనం చేసి వాడి స్వరూపమైన మోక్షాన్ని మీకు ఇస్తాడు, దొంగతనం అంటే అది. గోలక్ష్మి, ఫణి స్వామి భగవాన్ ఒడిలో ఎలా చనిపోయారో అలాగ జటాయువు రాముడి ఒడిలో చనిపోయింది. రావణాసురుడు రెండు రెక్కలు కొట్టేసాడు కాని ఇంకా ప్రాణం ఉంది. సీతమ్మను రావణాసురుడు తీసుకొనిపోయాడు

అని రాముడికి చెప్పింది జటాయువు. అప్పుడు జటాయువును తన ఒడిలో పెట్టుకొన్నాడు రాముడు. రాముడి తండ్రి అయిన దశరధుడికి చెయ్యని మర్యాదలు జటాయువుకి రాముడు చేసాడు. తండ్రి చనిపోయినప్పుడు రాముడు అయోధ్యలో లేడు. జటాయువు ధర్మయుద్ధం చేసింది కాబట్టి తన ఒడిలో పెట్టుకొని జటాయువును చేతితో నిమిరి ప్రాణం పోయేటప్పుడు ఏమన్నాడు అంటే మహాత్ములు, మహాయోగులు, ఋషులు అందరు మరణానంతరం ఏ లోకానికి వెళుతున్నారో నువ్వు కూడా ఆ లోకానికి వెళ్ళు జటాయువు అన్నాడు రాముడు. అంటే వెళ్ళవలసిందే అది రామాజ్ఞ. రాముడి బాణానికీ, రాముడి మాటకు తిరుగులేదు. తంజావూరు మహారాజు త్యాగరాజుగారి ఔన్నత్యానికి మెచ్చుకొని ఆయనకు చాలా బంగారం పంపాడు. ఆ బంగారాన్ని ఎదురుగా పెట్టుకొని నిధి సుఖమా, నీ పెన్నిధి సుఖమా అంటాడు త్యాగరాజు. ఆయన భక్తితో పాడుకొన్న పాటలు అంతేగాని అది మార్కెట్ సంగీతం కాదు.

రామకృష్ణ పరమహంసగారు మట్టి, రాయి, బంగారం ముక్క తీసుకొని గంగానది దగ్గరకు వెళ్ళేవారు. గంగానదిలో ముందు మట్టి ముక్కను వదిలేవారు, తరువాత రాయిని, తరువాత బంగారం ముక్కను వదిలేవారు. మట్టిని వదిలినప్పుడు నా మనస్సు ఎలా ఉందో బంగారం వదిలినప్పుడు కూడా నా మనస్సు అలాగే ఉందా లేదా అని చూసుకొనేవారు. మట్టి వదిలినప్పుడు ఎలాగ ఉందో బంగారం వదిలినప్పుడు కూడా అలాగే ఉండేదట, ఒడ్డుకు వచ్చేసాను అనుకొనేవాడు. అప్పుడు కలకత్తాలో ఈయనను పిచ్చివాడు అనుకొనేవారు, లోకం ఏమనుకొంటే ఏల ఆయన ఒడ్డుకు వచ్చేసారు. లోకం అంటే కుక్క తోకవంటిది, కుక్క తోక వంకర ఎవడు తీయగలడు. కొంతమందికి లౌక్యం లేకపోయినా భోగం ఉంటుంది. రామకృష్ణ పరమహంసగారికి అసలు లౌక్యం లేదు, భోగం లేదు. రాముడు మనలను ఆకర్షించటం లేదు, ఎవరో రామదాసుకు దర్శనమిచ్చాడు మనకు దర్శనం ఇవ్వటంలేదు అలా అనుకోకండి. రాముడి హృదయం ఎంత పవిత్రమైనదో, మీ హృదయం కూడా అంత పవిత్రమైతే ఆయన హృదయంలో మీకు చోటు ఇచ్చి తీరుతాడు అన్నాడు త్యాగరాజు. కలియుగంలో యోగాభ్యాసాలు చేయటం కష్టం, రామనామ సంకీర్తన వలన కలియుగంలో తరిస్తారు, రామనామం కలియుగానికి ఔషదం.

హరే రామ హరే రామ రామ రామ హరే హరే

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే

ఇది కలియుగానికి మహామంత్రం అని బ్రహ్మదేవుడు చెప్పాడు.

# గురువు లేకపోతే - గమ్యంపై గురి కుదరదు

తనను తాను సద్గురువుకు సంపూర్ణంగా సమర్పణ చేసుకోగల సమర్థత వ్యక్తికి కలిగితే లక్ష్యం కళ్ళఎదుటే కనిపిస్తుంది. పరమాత్మ ఎప్పుడు ఎవరికి దర్శనము ఇచ్చినా సద్గురువు రూపంలోనే దర్శనమిస్తాడు. గురువు కామధేనువు. కల్పవృక్షం, చింతామణి. గురువు జ్ఞానామృతాన్ని శిష్యునికి తరుణం కనిపెట్టి యొసంగుతాడు. నిత్యమూ కాపాడుతాడు. "గురు శిక్ష లేక గుఱ్ఱుతెట్టుకల్గున్; అజునికైన వాని అబ్బకైన తాళపు చెవి లేక తలుపెట్లు ఆడును" అన్నారు వేమన. కర్మ ఒక మహా సముద్రం లాంటిది. లెక్కలేనన్ని గత జన్మలలో ఉండిపోయిన కర్మలను తొలగించటం అసాధ్యం. కాని అదృష్టవశాత్తు ఒక సద్గురువు దొరికితే వారు మన కర్మలను అంతం చేస్తారు. సద్గురువు మీద భక్తి, ప్రేమ దివ్యనామాభ్యాసాల ద్వారా మనం నిష్కామకర్మ చేయగల్గుతాము. అవి కొత్త కర్మలను చేయనీయదు. గురు దయ వల్ల ప్రారబ్ధాన్ని ఉత్సాహంగా భరించగల్గుతాము. ఆవిధంగా గురువు మన కర్మల భారాన్ని వారి అధీనంలోకి తీసుకొని నశింపజేసి మనలను తరింపజేస్తాడు. సద్గురువును మోసపుచ్చటం కుదరదు. ఆయనను కలుసుకొనే విరహతాపం అధికంగా కలుగనంతకాలం ఆయన నిర్లిప్తంగానే ఉంటాడు. పిల్లవాడు బొమ్మలతో ఆడుకొంటూ ఉంటే తల్లి ఆతనిని మర్చిపోతుంది. కాని వాడు ఆ బొమ్మలతో విసిగి ఆవతల పారేసి అమ్మే కావాలి అని గుక్కపెట్టి ఏడుస్తూ ఉంటే తల్లి పరుగు పరుగున వచ్చి తన హృదయానికి హత్తుకొంటుంది. అలాగే మనం ప్రాపంచిక సుఖాలతో సంతృప్తితో ఉన్నంతకాలము గురువు మనలను పట్టించుకోడు. వాటితో మనం విసిగివేసారినప్పడు, ప్రారబ్ధం రీత్యా ఎదురు దెబ్బలు తగిలినప్పడు నిస్సహాయులైనప్పడు ఆ దీనబంధువును ఆదుకోమని ఆర్తితో ప్రార్థించినప్పడు ఆదరిస్తాడు. రామకృష్ణ పరమహంసగారు "నా చుట్టూ ఉన్న వారిని మహామాయ భందించలేదు" అని ఒకరి శరీరాన్ని తాకి అతనితో "ఈ రోజు నుంచి నీలోని కామాన్ని తొలగించాను" అన్నారు. గురువు నిరంతరం శిష్యునిని పరిశీలిస్తూ ఉంటాడు. మన ఈ జన్మకు, గత జన్మల్లో చేసిన నామసాధనను గ్రహించి ఆ నామాన్ని తిరిగి ఇచ్చి మన ఆత్మానుభవానికి గల అన్ని సౌకర్యాలను అమర్చిపెడతాడు. సారవంతమైన నేలలో వేసిన విత్తనం వర్షపునీటికి మొలకెత్తి వృద్ధి అయినట్లే గురువు అనేక ప్రయత్నాలతో మన దుర్గుణాలను నాశనం చేసి నేను, నాది అనే భావాలను తీసి ఆత్మవైపుకు మనస్సు వెళ్ళేటట్లు చేస్తూ ఆపదలను తొలగిస్తూ విశ్రాంతి అనేది లేకుండా కృషి చేస్తాడు. ఆయనే ఆశ్రయం, సుఖ స్వరూపమైనది. బేధబంధాలు తొలగించే అట్టి గురువుకు సాష్టాంగ నమస్కారం చేసి మొక్కటమే మన వంతు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూలై | 6 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జూలై | 12 | రమణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (యం.సి.ఎ. కాలేజ్), తాడేపల్లి, నల్లజర్ల రోడ్, తాడేపల్లిగూడెం (బస్టాండ్ నుండి 3 కి.మీ. దూరం) ఉ॥ గం॥ 11-00లకు ప్రారంభం, మ॥ గం॥ 12-00ల నుండి భోజనాలు ఏర్పాటు చేసినారు. మ॥ గం॥ 2-00లకు **ప్రవచనము** |
| జూలై | 18 | గురుపౌర్ణమి హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ, సత్యసాయి నిగం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# పరమ గురువు

ది॥ 18-07-2008న మనము జరుపుకొనే గురుపూర్ణిమ యావత్ సృష్టిలోని ముముక్షువులకు గొప్ప పండుగరోజు. గురువంటే బ్రహ్మమే, ఆత్మే! అట్టి ఆత్మే 'నేను' అను పరమసత్యం అనుభవైకవేద్యం అవడానికి దేహధారియైన గురువు అవసరం. అనుగ్రహస్వరూపుడు, కరుణాస్వరూపుడు, తేజోస్వరూపుడు అయిన గురువు కేవలం దేహానికే పరిమితుడు కాడు. కేవల అద్వయ సత్యమే తానైయుండి, తనకై ఏ ప్రత్యేకతను కలిగి యుండక తన సమక్షముచేత, వాక్కుచేత, చూపుచేత మనలోని సందేహించే వాడిని సమాధానపరుస్తారు గురువు. తన సహజ స్వరూపమైన శాంతిని, ఆనందాన్ని సృష్టిపై వర్షింపజేస్తారు గురువు. కేవలం మన మంచి గురించే మనతో సంబంధాన్ని కలిగియుంటారు. గురువు మన నుండి ఆశించేది మన అహంభావనను మాత్రమే! గురువు మన నుండి ఆశించే 'అహంభావనను' వారికి అర్పించగలిగితే, మనస్సును అంతర్ముఖం చేసి మనలను హృదయంలో స్వరూపంగా ఉన్న చైతన్యంలోకి మేల్కొలుపుతారు గురువు. సకల జీవకోటి శ్రేయస్సే గురువు లక్ష్యం. గురుకృపవల్లనే అంఖండాద్వైత స్థితి 'తాను'గా అనుభవైకవేద్యం అవుతుంది. విముక్తి ప్రదాత అయిన గురువుకు పరిపూర్ణ శరణాగతి చెంది తరిద్దాం!

**చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం



ఖండవిల్లిలో శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో సద్గురు శ్రీనాన్నగారు



మహేంద్రవాడ సభలో సద్గురు శ్రీ నాన్నగారిని సన్మానిస్తున్న దృశ్యం